

గోదాములు, విక్రయకేంద్రం భవనాలను సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి

రూ.92.45 కోట్లతో ధాన్యం గోదాములు, విక్రయ కేంద్రాలు

● ప్రారంభించిన సీఎం స్టాలిన్

చెన్నై, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సహకార, ఆహార, వినియోగవస్తువుల శాఖ ఆధ్వర్యంలోని రాష్ట్ర వినియోగవస్తువుల వాణిజ్య సంస్థ కొత్తగా నిర్మించిన ధాన్యం గోదాములు, వరి విక్రయ కేంద్రం భవనాలను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ గురువారం ప్రారంభించారు. రూ.10.20 కోట్లతో కొత్తగా నిర్మించనున్న ఆరు మినీ గోదాములకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఈవీ వేలు, కేఆర్ పెరియకరుప్పన్, ఎ. చక్రపాణి, టీఆర్బీ రాజా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, సహకార ఆహార వినియోగవస్తువుల సంరక్షణ శాఖ ముఖ్య కార్యదర్శి సత్యప్రదసాహు, సహకార సంఘాల రిజిస్ట్రార్ కే నందకుమార్ తదితరులు పాల్గొన్నారు.



కొత్త రహదారుల ప్రారంభం...

రహదారులు, మినీ ఓడరేవుల శాఖ ఆధ్వర్యంలో జరిగిన మరొక కార్యక్రమంలో రూ.1141.23 కోట్లతో అభివృద్ధిచేసిన సెయ్యూరు - పనయూరు లింకు రోడ్డు సహా 109 కి.మీ. సెయ్యూరు - వందవాసి - పోలూరు రహదారిని ముఖ్యమంత్రి స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఈవీ వేలు, రహదారులు మినీ ఓడరేవుల శాఖ కార్యదర్శి డాక్టర్ ఆర్ సెల్వరాజ్, చెన్నై - కన్నియాకుమారి పారిశ్రామిక రహదారి పథక సంచాలకులు భాస్కర పాండ్యన్, చీఫ్ ఇంజనీర్ డి.జెబసెల్విన్ తదితరులు పాల్గొన్నారు.


శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా 'తమిళ్' అనే పదం ఆకారంలో నిలిచిన అన్నానగర్ వేళమ్మాళ్ కళాశాల విద్యార్థులు

బహిరంగ ప్రదేశాల్లో పార్టీ జెండాలను అనుమతించం

● హైకోర్టు

చెన్నై, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇబ్బంది కలిగించే రీతిలో బహిరంగ ప్రదేశాల్లో పార్టీ జెండా స్తంభాలను ఏర్పాటు చేసేందుకు అనుమతించే ప్రసక్తే లేదని, రాజకీయ పార్టీలన్నీ తమ జెండాలను పార్టీ ఆఫీసుల్లోనే ఏర్పాటు చేసుకోవడం మంచిదని హైకోర్టు మదురై డివిజన్ బెంచ్ న్యాయమూర్తులు స్పష్టం చేశారు. బహిరంగ ప్రదేశాల్లో నాయకుల విగ్రహాలు, పార్టీల జెండాలను ఏర్పాటు చేయడాన్ని సహించబోమని కూడా హెచ్చరించారు. తంజావూరు జిల్లాకు చెందిన అన్నాడీఎంకే నేత ముత్తుకృష్ణన్ తిరువారూరు జిల్లా నాచ్చియార్ కోవిల్ తీర్థకొలను సమీపంలో ఉన్న ఎంజీఆర్ విగ్రహాన్ని, పార్టీ పతాకాన్ని తొలగించేందుకు రహదారుల శాఖ అధికారులు చేస్తున్న ప్రయత్నాలను నిలుపుదల చేయాలని కోరుతూ హైకోర్టు మదురై డివిజన్ బెంచ్‌లో పిటిషన్ వేశారు. ఆ పిటిషన్‌పై న్యాయమూర్తులు నిషాభాను, శ్రీమతి విచారణ జరిపారు. ఆ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ రాష్ట్రంలో బహిరంగ ప్రదేశాల్లో రాజకీయ పార్టీల జెండాలు ఏర్పాటు చేయడం ఆనవాయితీగా మారిందని, ఏ పార్టీ అయినా సరే నేతల విగ్రహాలు, పార్టీ జెండాలను ఆయా పార్టీల కార్యాలయాల్లో ఏర్పాటుచేసుకోవచ్చు కదా అని మండిపడ్డారు. అంతటితో ఆగకుండా పిటిషన్‌కు జరిమానా విధించి తోసిపుచ్చాలని భావిస్తున్నట్లు పిటిషనర్‌కు తెలిపారు. వెంటనే పిటిషనర్ ముత్తుకృష్ణన్ తన పిటిషన్‌ను వాపసు చేసుకునేందుకు అంగీకరించారు. దీంతో పిటిషన్ తోసివేతకు గురైనట్లు న్యాయమూర్తులు ప్రకటించారు.

ద్విభాషా విధానంపై పట్టుసడలించం

రూ.2152కోట్లు విడుదల చేయండి ● ప్రధానికి స్టాలిన్ లేఖ

చెన్నై, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): డీఎంకే ప్రభుత్వం ద్విభాషా విధానం అమలుకే కట్టుబడి ఉందని, ఎట్టి పరిస్థితుల్లో త్రిభాషా విధానాన్ని అమలు చేసే ప్రసక్తే లేదని, అదే సమయంలో దొడ్డిదారిన నిర్బంధంగా హిందీ అమలు చేయడానికి జరుగుతున్న ప్రయత్నాలను అడ్డుకుంటామని ప్రధాని నరేంద్రమోదీకి ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఓ లేఖ రాశారు. రాష్ట్రంలోని టీచర్లు, విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని జాప్యంలేకుండా సమగ్ర శిక్షా అభియాన్ పథకం నిధులు రూ.2152 కోట్లను తక్షణమేవిడుదలచేసేలా ఉత్తర్వులివ్వాలని మోదీకి విజ్ఞప్తి చేశారు. ఇటీవల కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ జాతీయ విద్యావిధానం -2020 పూర్తిగా అంగీకరించి, త్రిభాషా విద్యావిధానానికి అంగీకరించేంతవరకూ రాష్ట్రానికి సమగ్ర శిక్షా అభియాన్ నిధులను విడుదల చేయబోమని చేసిన ప్రకటన తనకు తీవ్ర ఆందోళన కలిగించిందని, ఆ ప్రకటన నాయకులు, విద్యార్థులే కాకుండా సామాన్య ప్రజానీకంలోనూ తీవ్ర ఉద్రిక్తతను రేకెత్తిస్తోందని స్టాలిన్ పేర్కొన్నారు. 1976లో పేర్కొన్న విధంగా అధికారిక భాషల చట్టం 1963 అమలు నుంచి రాష్ట్రానికి మినహాయింపు ఉందనే విషయాన్ని స్టాలిన్ ఆ లేఖలో గుర్తు చేశారు. నవోదయ విద్యాలయ వంటి కేంద్ర ప్రభుత్వ పాఠశాలల్లో త్రిభాషా విధానాన్ని అనుసరించడం వల్లే రాష్ట్రంలో ఆ పాఠశాలలను నెలకొల్పలేదనే విషయాన్ని కూడా గమనించాలన్నారు. ద్విభాషావిధానంతో అర్ధశతాబ్ద కాలంగా రాష్ట్రం విద్యా రంగంలో అత్యున్నత స్థితికి చేరుకుందని, అలాంటప్పుడు ద్విభాషా విద్యావిధానంలో మార్పులు చేయడానికి రాష్ట్ర ప్రజలు అంగీకరించరన్నారు. అదే విధంగా జాతీయ విద్యావిధానం అమలు వలన రాష్ట్రానికి జరగనున్న నష్టాలను వివరిస్తూ గతేడాది ఆగస్టు 27న తన నిరసన తెలుపుతూ కేంద్రానికి లేఖ పంపినట్లు స్టాలిన్ తెలిపారు. ఓ రాష్ట్రంలో యేళ్లతరబడి అమలుపరుస్తున్న విధివిధానాలు,లక్ష్యాలకు ప్రతికూలంగా ఓ పథకాన్ని బలవంతంగా అందులోనూ విద్యలో అగ్రగామిగా ఉన్న రాష్ట్రంలో అమలు చేయాలనుకోవడం ఫెడరల్ రాజ్యాంగ విధానాన్ని వ్యతిరేకమని స్టాలిన్ పేర్కొన్నారు. ప్రతియేటా సమగ్ర శిక్షా అభియాన్ పథకానికి క్రమం తప్పకుండా విడుదల చేస్తున్న నిధులకు, నూతన విద్యా విధానం, త్రిభాషా విద్యావిధానం అమలుకు ఉన్న సంబంధం ఏమిటో తెలియటం లేదన్నారు. ఈ అంశాలను నిశితంగా పరిశీలించి వెంటనే సమగ్ర శిక్షా అభియాన్ పథకం కింద రూ.2152 కోట్లను విడుదలయ్యేలా ఉత్తర్వు లివ్వాలని ప్రధాని మోదీకి ఆయన విజ్ఞప్తి చేశారు.


జెండా ఊపి మారథాన్ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

వీఐటీలో 'రివేరా-2025 కల్చరల్ ఫెస్ట్' ప్రారంభం

వేలూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక వీఐటీ యూనివర్సిటీలో నాలుగు రోజుల 'రివేరా-2025 కల్చరల్ ఫెస్టివల్' గురువారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా ప్రముఖ బాస్కెట్ బాల్ క్రీడాకారిణి పద్మశ్రీ అనితా పాల్‌దొరై హాజరై మారథాన్ పోటీలు ప్రారంభించారు. వర్సిటీ నుంచి ప్రారంభమైన మారథాన్ కరిగిరి ఆస్పత్రి జంక్షన్ వరకు వెళ్లి తిరిగి వర్సిటీ ప్రాంగణానికి చేరుకొనేలా 9.9 కి.మీ నిర్వహించారు. ఈ పోటీలు వీఐటీ వర్సిటీ ఉపాధ్యక్షులు శంకర్ విశ్వనాథన్ నేతృత్వంలో సాగాయి. ఈ సందర్భంగా అనితా పాల్ దొరై మాట్లాడుతూ. బాస్కెట్ బాల్ క్రీడాకారిణిగా 19 ఏళ్ల భారత జట్టుకు ఆడానని, జీవితంలో లక్ష్యాన్ని నిర్దేశించుకొని దానిని చేరుకొనేందుకు ప్రయత్నించాలని పిలుపునిచ్చారు. అనంతరం మారథాన్ పోటీ విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వర్సిటీ క్రీడా విభాగం డైరెక్టర్లు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆగని శ్రీలంక దాడులు

10 మంది జాలర్ల అరెస్టు ● మరపడవల స్వాధీనం

చెన్నై, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరం సమీపం నెడుదీవి వద్ద గురువారం వేకువ జాము చేపలవేటకు వెళ్లిన తమిళ జాలర్లపై శ్రీలంక నావికాదళం దాడులకు పాల్పడింది. తమ దేశ సముద్ర సరిహద్దుల్లోకి అక్రమంగా చొరబడ్డారంటూ మూడు మరపడవలను చుట్టుముట్టి విలువైన జీపీఎస్ తదితర పరికరాలు, చేపల సంపదను దోచుకుంది. అంతటితో ఆగకుండా రామేశ్వరంకు చెందిన పదిమంది జాలర్లను అరెస్టు చేసింది. గురువారం మధ్యాహ్నానికల్లా ఆ జాలర్లను శ్రీలంకలోని మైలాడి చేపలరేవు వద్దనున్న నావికాదళం కార్యాలయంలో నిర్బంధించారు.


రామేశ్వరంలో ధర్నా చేస్తున్న జాలర్ల కుటుంబీకులు

కేంద్రమంత్రికి స్టాలిన్ లేఖ..: శ్రీలంక నావికాదళం దాడి చేసి నిర్బంధించిన రామేశ్వరం ప్రాంతానికి చెందిన 10మంది జాలర్లను విడిపించేలా చర్యలు చేపట్టాలని కోరుతూ కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జయశంకర్‌కు స్టాలిన్ లేఖ రాశారు. తమిళజాలర్లపై శ్రీలంక నావికాదళం దాడులు, అక్రమ నిర్బంధాలను నిరోధించేందుకు రెండు దేశాల జాలర్ల సంఘాల నాయకులతో సమావేశం జరపాలని డిమాండ్ చేశారు.


చెన్నై టి.నగర్‌లోని పద్మావతి ఆలయ బ్రహ్మోత్సవాల్లో హనుమంత వాహనంపై ఆశీనులై కనువిందు చేస్తున్న అమ్మవారు

వారం ముందే స్టాలిన్ జన్మదిన వేడుకలు

● ఐదు నియోజకవర్గాల్లో యేడాది పొడవునా అల్పాహారం
● ప్రారంభించిన దుర్గాస్టాలిన్

చెన్నై, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ మార్చి 1న 72వ వసంతంలోకి అడుగుపెడుతున్న నేపథ్యంలో వారం రోజులకు ముందే డీఎంకే శ్రేణులు ఆయన జన్మదిన వేడుకలను అట్టహాసంగా ప్రారంభించారు. ఆ పార్టీ చెన్నై ఈస్ట్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం ఉదయం ఐదు శాసనసభ నియోజకవర్గాల్లో 'అన్నం తరుమ్ అముదకరంగళ్' (అన్నదానం చేసే అమృతహస్తాలు) పేరుతో అల్పాహార పంపిణీ పథకాన్ని ముఖ్యమంత్రి సతీమణి దుర్గాస్టాలిన్ ప్రారంభించారు. కొళత్తూరు అగరం, జగన్నాథన్ రోడ్డులోని ముఖ్యమంత్రి కార్యాలయం సమీపంలో పార్టీ జిల్లా నేత, దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు ఆధ్వర్యంలో అల్పాహార పంపిణీ పథకాన్ని ఆమె అట్టహాసంగా ప్రారంభించారు. వచ్చే యేడాది ఫిబ్రవరి 19 వరకూ యేడాది పొడవునా హార్బర్, తిరువిక నగర్, అంబత్తూరు, విల్లివాక్కం, ఎగ్మూరు శాసనసభ నియోజకవర్గాల్లో రోజుకో ప్రాంతం చొప్పున ఉదయం పూట వెయ్యి మందికి అల్పాహారం పంపిణీ చేయనున్నారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్.ప్రియ, నార్త్ చెన్నై ఎంపీ డాక్టర్ కళానిధి వీరాసామి, ఎమ్మెల్యేలు తాయగం కవి, వెట్రి అళగన్, జోసెఫ్ సాముయేల్, కార్పొరేషన్ జోనల్ కమిటీ నేతలు సరితా మహేష్‌కుమార్, కేపీ జైన్, పీకే మూర్తి, పట్టణ పంచాయతీ సభ్యులు ఐసీఎఫ్ మురళీధరన్, చంద్రు, మహేష్‌కుమార్, కార్పొరేటర్లు నాగరాజన్, దావూద్‌బీ, యోగప్రియా, శ్రీధని, అముదా, శారద, పార్టీ ప్రముఖులు పాల్గొన్నారు.


చిన్నారులకు అల్పాహారం అందజేస్తున్న సీఎం సతీమణి దుర్గాస్టాలిన్

● రెండాకుల గుర్తు వ్యవహారం... ఎన్నికల సంఘానికి ఈపీఎస్ పిటిషన్

● ఉద్వాసనకు గురైనవారి వాదనలు విస్మరించండి

ప్యారీస్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రెండాకుల గుర్తు వ్యవహారంలో పార్టీ నుంచి ఉద్వాసనకు గురైన వారు చేసే ఫిర్యాదులపై విచారణ జరపకూడదంటూ కేంద్ర ఎన్నికల కమిషన్‌లో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళని స్వామి గురువారం కొత్తగా పిటిషన్ దాఖలు చేశారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించిన మాజీముఖ్యమంత్రి జయలలిత మరణానంతరం పార్టీ ప్రధాన పదవుల్లో మార్పులు, చేర్పులు జరిగాయి. సమన్వయ కర్త, ఉప సమన్వయ కర్త పదవులను రద్దు చేస్తూ ఆ పార్టీ రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశం ఏకగ్రీవ తీర్మానం ఆమోదించింది. దీంతో ఎడప్పాడి పళని స్వామి అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శిగా ఎంపికయ్యారు. ఆ తర్వాత పార్టీ నియమ నిబంధనలను ఉల్లంఘించారని కారణంతో మాజీముఖ్యమంత్రి ఓ.పన్నీర్ సెల్వం సహా ఆయన మద్దతు దారులను పార్టీ నుండి తొలగించారు. అనంతరం ఈపీఎస్ నేతృత్వంలోని అన్నాడీఎంకేకు ఈసీ రెండాకుల గుర్తు కేటాయించింది. దీనిని వ్యతిరేకిస్తూ ఓపీఎస్ తరుపున దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన మద్రాస్ హైకోర్టు అన్నాడీఎంకే కార్యవర్గ సమావేశం తీర్మానాలను సమర్థిస్తూ తీర్పునిచ్చింది. అదే సమయంలో పార్టీ నుంచి తొలగించిన వ్యవహారంలో హక్కుల న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని హైకోర్టు సూచించింది. ఈ నేపథ్యంలో, దిండుగల్‌కు చెందిన సూర్యమూర్తి హైకోర్టులో ఓ పిటిషన్ వేశారు. అన్నాడీఎంకే పార్టీలో నేతల మధ్య జరుగుతున్న విభేదాలకు సంబంధించిన కేసు విచారణ పూర్తయ్యే వరకు రెండాకుల గుర్తు వినియోగించుకోకుండా ఈపీఎస్‌కు ఆదేశించాలని కోరారు. దీనిని వ్యతిరేకిస్తూ పళనిస్వామి అప్పీలుకు వెళ్లారు. అంతేకాకుండా అన్నాడీఎంకేలో సభ్యత్వంలేని వ్యక్తి కేంద్ర ఎన్నికల కమిషన్‌కు పెట్టిన పిటిషన్‌పై విచారణ జరపకుండా స్టే విధించాలని హైకోర్టును అభ్యర్థించారు. విచారణ జరిపిన న్యాయస్థానం మధ్యంతర స్టే విధిస్తూ జారీచేసిన ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ పుహళేంది, రామకుమార్, ఆధిత్యన్, కేసి పళనిస్వామి, సూర్యమూర్తి, ఓపీఎస్ కుమారుడు రవీంద్రనాథ్ హైకోర్టులో పిటిషన్లు వేశారు. ఈ కేసులో అందరి తరుపు వాదనలను విన్న హైకోర్టు ఈ నెల 12న ఇచ్చిన తీర్పులో, అన్నాడీఎంకే అంతర్గత వ్యవహారంపై విచారణ జరిపేందుకు ఈసీకి గతంలో విధించిన స్టే ఉత్తర్వులను తొలగించింది. అయితే పార్టీ ఎన్నికల గుర్తు కేటాయింపు విధి, విధానాల ప్రకారం విచారణ జరిపాలంటూ ఈసీకి హైకోర్టు అనుమతిచ్చింది. ఈ పరిస్థితుల్లో ఈపీఎస్ తరుపున ఢిల్లీలోని కేంద్ర ఎన్నికల కమిషన్ కార్యాలయంలో గురువారం కొత్తగా పిటిషన్ దాఖలైంది. అందులో పార్టీకి వ్యతిరేకంగా పిటిషన్లు వేసినవారంతా ప్రస్తుతం పార్టీలో సభ్యులు కారని, వీరిలో సూర్యమూర్తికి పార్టీతో ఎలాంటి సంబంధం లేదని అందువల్ల వారు వేసిన పిటిషన్లపై విచారణ జరపవద్దని ఈపీఎస్ తన పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు.

సమాచార దర్శిని

'సాహిత్యవనంలో లలిత సంగీత సౌరభం'పై 23న స్వాతి శ్రీపాద ప్రసంగం

చెన్నై, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 23న 'సాహిత్యవనంలో లలిత సంగీత సౌరభం అనే అంశంపై ప్రసంగం ఉంటుందని వేదవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు జేకే రెడ్డి, కార్యదర్శి కందనూరు మధు ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. వేదిక ఆధ్వర్యంతో తరతరలా తెలుగు కవిత ఉపన్యాస ధారావాహికలో భాగంగా 158వ ప్రసంగ కార్యక్రమంగా హైదరాబాద్‌కు చెందిన విశ్రాంతాచార్యులు, కవయిత్రి స్వాతి శ్రీపాద 'సాహిత్యవనంలో లలిత సంగీత సౌరభం' అనే అంశంపై ప్రసంగించనున్నారని తెలిపారు. టినగర్ ఆంధ్రాక్లబ్ కృష్ణాహాలులో ఈ నెల 23 సాయంత్రం 6.30 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని, సాహితీ ప్రియులు సహా అందరూ ఆహ్వానితులేనని పేర్కొన్నారు.

28న రైతుల గ్రీవెన్స్

పెరంబూర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఈనెల 28న రైతుల గ్రీవెన్స్ జరుగనుంది. ఈ మేరకు కలెక్టర్ కలైసెల్వి విడుదల చేసిన ప్రకటనలో... సమావేశంలో వ్యవసాయ, ఉద్యానవన, విద్యుత్, రెవెన్యూ, సహకార, వెటర్నరీశాఖలకుచెందిన అధికారులు పాల్గొంటారని, రైతులు, రైతుసంఘాల ప్రతినిధులు తమ సమస్యలు తెలిపి పరిష్కారం పొందవచ్చని కలెక్టర్ తెలియజేశారు.

నేటినుంచి కడలూరు జిల్లాలో సీఎం పర్యటన

పెరంబూర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లాలో శుక్ర, శనివారాల్లో ముఖ్యమంత్రి స్టాలిన్ పర్యటించనున్నారు. ప్రభుత్వ పథకాలు, జిల్లాలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పరిశీలించేలా సీఎం అన్ని జిల్లాల్లో పర్యటిస్తున్నారు. అందులో భాగంగా శుక్ర, శనివారాల్లో ముఖ్యమంత్రి కడలూరు జిల్లాలో పర్యటించనున్నారు. మంజకుప్పం మైదానంలో శుక్రవారం సాయంత్రం జరిగే కార్యక్రమంలో వివిధ శాఖల ఆధ్వర్యంలో సుమారు 30 వేల మందికి సీఎం సహాయాలు అందజేయనున్నారు. అనంతరం నైవేలీలో జరిగే కార్యక్రమంలో 5 వేల మందికి పైగా దివ్యాంగులు సీఎం సమక్షంలో డీఎంకేలో చేరనున్నారు.

వారాంతపు ప్రత్యేక బస్సులు

పెరంబూర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రజల సౌకర్యార్థం ఈ నెల 21వ తేది నుంచి ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ ప్రకటించింది. 21వ తేది శుక్రవారం, 21 శనివారం, 22వ తేది ఆదివారం ప్రయాణికుల సౌకర్యార్థం కిలాంబాక్కం బస్ టెర్మినల్ నుంచి తిరువణ్ణామలై, తిరుచ్చి, కుంభకోణం, మదురై, తిరునల్వేలి, కన్నియాకుమారి, తూత్తుకుడి, కోయంబత్తూర్, ఈరోడ్, సేలం తదితర ప్రాంతాలకు ఈ నెల 21వ తేది 245 బస్సులు, 22వ తేది 240 బస్సులు నడుపనున్నారు. అలాగే, కోయంబేడు నుంచి తిరువణ్ణామలై, నాగపట్టణం, వేలాంకన్ని, హోసూరు, బెంగళూరు తదితర ప్రాంతాలకు 21,22 తేదీల్లో తలా 51 ప్రత్యేక బస్సులు, మాధవరం బస్ టెర్మినల్ నుండి 21,22 తేదీల్లో తలా 20 ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు రవాణా శాఖ తెలిపింది.

26న రామేశ్వరం ఆలయ రథోత్సవం

పెరంబూర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరం రామనాథస్వామి ఆలయంలో ప్రతిఏడాది మహాశివరాత్రి,ఆడితిరుకల్యాణం వేడుకలు వైభవంగా జరుగుతుంటాయి. ఈ ప్రకారం,ఈఏడాది మహాశివరాత్రి ఉత్సవాలు బుధవారం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. వేడుకల్లో భాగంగా ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేకాలతో పాటు వివిధ వాహనాల్లో ఉత్సవమూర్తులు విహరించనున్నారు. వేడుకల్లో 9వ రోజైన 26వ తేది మహాశివరాత్రి రోజు స్వామి-అంబాళ్ రథోత్సవం నిర్వహించనున్నారు. 27వ తేది ఉత్సవమూర్తులను వెండి వృషభ వాహనంలో అగ్ని తీర్థ సముద్రతీరంలో తీర్థవారి జరుగనుంది. మార్చి 1వ తేది చండీకేశ్వరుడు వీధి ఊరేగింపుతో వేడుకలు ముగియనున్నాయి.

రేపు, ఎల్లుండి చెన్నై బీచ్-తాంబరం మధ్య సబర్బన్ సర్వీసుల రద్దు

పెరంబూర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక చెన్నై బీచ్-తాంబరం మధ్య శని, ఆదివారాల్లో పలు సబర్బన్ రైలు సర్వీసులు రద్దు చేస్తున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ఆ ప్రకారం, శనివారం చెన్నై బీచ్-తాంబరం మధ్య సాయంత్రం 6.46 గంటలు, రాత్రి 7.39, 10.20, 11.30 రైళ్లు రద్దు. అలాగే, ఆదివారం తాంబరం-చెన్నై బీచ్ మధ్య వేకువజామున 3.55 గంటలు, 4.15, చెన్నై బీచ్-తాంబరం మధ్య తెల్లవారుజామున 4.15 గంటలు, ఉదయం 6.15 గంటల సబర్బన్ రైళ్లు రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే తెలిపింది.

చెంగల్పట్టులో పుస్తక ప్రదర్శన

పెరంబూర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా యంత్రాంగం, తమిళనాడు సైన్స్ సమాఖ్య, చెంగల్పట్టు భారతీయార్ మండ్రం సంయుక్త ఆధ్వర్యంలో 6వ వార్షిక పుస్తక ప్రదర్శన గురువారం ప్రారంభమైంది. ఈ ప్రదర్శనను సూక్ష్మ, చిన్న, మధ్యతరగతి పరిశ్రమల శాఖా మంత్రి అన్బరసన్ ప్రారంభించగా, జిల్లా కలెక్టర్ అరుణ్‌రాజ్, జిల్లా రెవెన్యూ అధికారి షేక్ ముహయద్దీన్ సహా పలువురు అధికారులు పాల్గొన్నారు. ఈ పుస్తక ప్రదర్శన ఈ నెల 28వ తేది వరకు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

జయ పేరవై ఆధ్వర్యంలో తిన్నెలపై ప్రచారం

● మాజీమంత్రి ఆర్బీ ఉదయ్‌కుమార్

ప్యారీస్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీకి 2026లో జరగనున్న ఎన్నికలను పురస్కరించుకుని తిన్నె (అరుగు)లపై ప్రచారం చేయనున్నట్లు అన్నాడీఎంకే సీనియర్ నేత, జయలలిత పేరవై రాష్ట్ర కార్యదర్శి ఆర్బీ ఉదయ్‌కుమార్ పేర్కొన్నారు. రాయపేటలో అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయంలో జయలలిత పేరవై సమావేశం ఉదయ్‌కుమార్ అధ్యక్షతన గురువారం జరిగింది. పేరవై జిల్లా స్థాయి నిర్వాహకులు పాల్గొన్న ఈ సమావేశం ఆమోదించిన తీర్మానాల ను ఆయన మీడియాకు వివరించారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకేను 234 నియోజకవర్గాల్లో గెలిపించాలన్న లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా తిన్నెలపై ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం ఉత్తర చెన్నై అన్నాడీఎంకే కార్యదర్శి ఆర్ఎస్ రాజేష్ అధ్యక్షతన వ్యాసర్పాడి ప్రాంతంలో జయ పేరవై నిర్వాహకులు ఇంటింటికి వెళ్ళి కరపత్రాలు పంపిణీ చేసి, తిన్నె ప్రచారంలో పాల్గొంటారని తెలిపారు. అదే విధంగా దివంగత మాజీముఖ్యమంత్రులు ఎంజీఆర్, జయలలిత, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ముఖ్యమంత్రిగా వ్యవహరించిన సమయంలో రాష్ట్ర ప్రజలకు అందించిన సంక్షేమ అభివృద్ధి పథకాల గురించి ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. మాజీముఖ్యమంత్రి జయలలిత 72వ జయంతి సందర్భంగా పేదలకు జయ పేరవై తరుపున సంక్షేమ సహాయాలు అందజేసేలా తీర్మానం చేసినట్లు తెలిపారు.



తిన్నెలపై ప్రచార కరపత్రం ఆవిష్కరణ కార్యక్రమంలో ఆర్బీ ఉదయ్‌కుమార్, ఆర్ఎస్ రాజేష్ తదితరులు

భారతీయ పర్యాటకులకు మెరుగైన వసతులు

● మాస్కో మేయర్ ఎవ్జెనీ

ప్యారీస్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): తమ దేశానికి వచ్చే భారత పర్యాటకులకు మెరుగైన వసతులు కల్పించినట్లు మాస్కో నగర పర్యాటక కమిటీ చైర్మెన్, మేయర్ ఎవ్జెనీ క్లోజోవ్ తెలిపారు. ఆళ్వార్‌పేటలోని రష్యన్ కల్చరల్ సెంటర్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, మాస్కో టూరిజంలో భారతదేశం కీలక పాత్ర పోషిస్తుందని, గత ఏడాది 9నెలల్లో సుమారు 61వేల మంది భారతీయులు మాస్కో నగరాన్ని సందర్శించినట్లు ఆయన తెలిపారు. భారతీయ సందర్శకుల సంఖ్య నిరంతరం పెరుగుతుండడం ఎంతో ఆనందంగా వుందని, మాస్కోకి చెందిన 14 ట్రావెల్ కంపెనీలు, 109 విదేశీ ట్రావెల్స్ ఏజెన్సీలతో ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు ఆయన తెలిపారు.

నాలుగు డిగ్రీలు పెరగనున్న ఎండలు

పెరంబూర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో ఈ నెల 23వ తేది వరకు ఎండ తీవ్రత సాధారణం కన్నా 3 నుంచి 4 డిగ్రీల సెల్సియస్ పెరగనుంది. ఈ మేరకు ప్రాంతీయ వాతావరణ పరిశోధన కేంద్రం విడుదల చేసిన ప్రకటనలో... ఈ నెల రెండో వారం నుంచే ఉదయం వేళల్లో మంచు, పగటి ఉష్ణోగ్రతలు 2-3 డిగ్రీలు పెరుగుతున్నాయని తెలిపింది. శుక్రవారం నుంచి 23వ తేది వరకు రాష్ట్రవ్యాప్తంగా పొడి వాతావరణం నెలకొని, పగటి ఉష్ణోగ్రతలు 3-4 డిగ్రీల సెల్సియస్ వరకు పెరుగనున్నట్లు తెలిపింది. రాజధాని నగరం చెన్నైలో ఆకాశం మేఘావృతంగా ఉంటూ, ఉదయం వేళల్లో స్వల్పంగా మంచు కురవడం, పగటి ఉష్ణోగ్రతలు 33 డిగ్రీలు, రాత్రి ఉష్ణోగ్రతలు 23 డిగ్రీల సెల్సియస్ నమోదయ్యే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది.

చేపల మార్కెట్లో అధికారుల తనిఖీలు



చేపలు తనిఖీ చేస్తున్న అధికారులు

పెరంబూర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కుంభకోణం చేపల మార్కెట్లో ఆహార భద్రతా శాఖ అధికారులు బుధవారం తనిఖీలు చేపట్టారు. ఈ మార్కెట్లో చెడిపోయిన చేపలు విక్రయిస్తున్నట్లు అధికారులకు ఫిర్యాదులందాయి. దీంతో, మార్కెట్లో తనిఖీలు చేసిన సుమారు 150 కిలోల చెడిపోయిన చేపలు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వాటిని గుంత తవ్వి రసాయనాలు పూసి పూడ్చిపెట్టారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వ్యాపారులపై చర్యలు చేపడతామని అధికారులు హెచ్చరించారు.

7నుంచి 'విష్ణు సహస్రనామ వైభవం' పై షణ్ముఖశర్మ ప్రవచనాలు



చెన్నై, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): శర్వాణీ సంగీత సభ ట్రస్టు ఆధ్వర్యంలో టి.నగర్ శృంగేరీ భారతీ విద్యాశ్రమం సహకారంతో మార్చి 7న బ్రహ్మశ్రీ డాక్టర్ సామవేదం షణ్ముఖశర్మ 'విష్ణు సహస్రనామ సార వైభవం' అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం చేయనున్నారని ట్రస్టు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. టి.నగర్ వెంకటనారాయణ రోడ్డులోని శృంగేరీ భారతీ విద్యాశ్రమంలో జరిగే ఈ ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమం మార్చి తొమ్మిదివరకూ జరుగుతాయని, ప్రతి రోజూ సాయంత్రం 6.30 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. మార్చి తొమ్మిదో తేదీ సాయంత్రం 4.30 గంటల నుండి 6 గంటల వరకు 'శివపదం' విశిష్టగానం నిర్వహించనున్నారని, నిహాల్, సుంకేశుల వెంకటనాగరాజన్ గానానికి డా. వీఎల్ సుదర్శన్ (వైలిన్), ఎస్.విజయేంద్రన్ (మృదంగం) వాద్య సహకారం అందిస్తారని, ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని నిర్వాహకులు పేర్కొన్నారు.

వేంగైవయల్ కేసులో ముగ్గురికి సమన్లు

పెరంబూర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వేంగైవయల్ కేసులో నేరారోపణలు ఎదుర్కొంటున్న ముగ్గురు మార్చి 11వ తేది కోర్టులో హాజరుకావాలని సమన్లు పంపించారు. పుదుకోట జిల్లా వేంగైవయల్ గ్రామంలోని తాగునీటి ట్యాంక్‌లో మానవ వ్యర్థాలు కలిపారంటూ కానిస్టేబుల్ మురళీరాజా, సుదర్శన్, ముత్తుకృష్ణన్‌లపై కేసు నమోదైంది. కోర్టులో సీబీసీఐడీ చార్జిషీటు దాఖలుచేశారు. ఈ కేసు బుధవారం విచారణకు రాగా, నేరారోపణ ఎదుర్కొంటున్న ముగ్గురు మార్చి 11వ తేది కోర్టుకు హాజరుకావాలని పుదుకోట జిల్లా కోర్టు సమన్లు జారీచేసి, ముగ్గుర్ని కోర్టులో హాజరుపరచాలని సీబీసీఐడీ పోలీసులకు ఉత్తర్వులు జారీచేసింది.

కుల గణన జరపాల్సిందే

● పీఎంకే డిమాండ్

ప్యారీస్, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): కులాల వారీగా జనగణన నిర్వహించాలని పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నుంగంబాక్కం వళ్లువర్ కోట్టమ్ సమీపంలో గురువారం ఉదయం పీఎంకే నిర్వహణలోని సామాజిక న్యాయ పేరవై ఆధ్వర్యంలో అన్బుమణి రాందాస్ అధ్యక్షతన మహాధర్నా జరిగింది. మాజీ కేంద్రమంత్రి ఏకే మూర్తి, పీఎంకే మాజీ అధ్యక్షుడు జీకే మణి, తమిళ మానిల కాంగ్రెస్ నాయకులు విడియల్ శేఖర్, జీఆర్ వెంకటేష్, ఏఎంఎంకే ఉప ప్రధాన కార్యదర్శి సెంథమిళన్, పురచ్చి భారతం ఎమ్మెల్యే జగన్మూర్తి, ఐజేకే అధ్యక్షుడు రవి పచ్చముత్తు సహా వివిధ పార్టీలు, కుల సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని కుల గణన జరపాల్సిందేనంటే నినాదాలు చేశారు. ఈ ధర్నాను ప్రారంభించి అన్బుమణి మాట్లాడుతూ, దేశంలోని పలురాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వాలు సామాజిక న్యాయాన్ని గౌరవిస్తూ కుల గణన ప్రక్రియను పూర్తిచేసి అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయాన్ని చేకూర్చాయని చెప్పారు. బిహార్ రాష్ట్రంలో ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ 46రోజుల వ్యవధిలో కుల గణన ప్రక్రియను పూర్తిచేశారని, ఆ రాష్ట్రంలో లాగే కుల గణన నిర్వహించాలని తమ పార్టీ తరుపున పలుమార్లు విజ్ఞప్తి చేసినా డీఎంకే ప్రభుత్వం పట్టించుకోకుండా సామాజిక న్యాయాన్ని విస్మరించడం ఖండించదగ్గదన్నారు.



ధర్నాలో పాల్గొన్న వివిధ పార్టీల నేతలతో పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి

'సెల్వ మగళ్' ఖాతా ప్రారంభానికి ప్రత్యేక శిబిరాలు

పెరంబూర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): 'సెల్వ మగళ్' పొదుపు ఖాతా పథకంలో, పదేళ్లు నిండిన బాలికలను చేర్చేలా ఈ నెల 21,28, మార్చి 10వ తేది ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు చెన్నై నగర మండల తపాలా శాఖ చైర్మెన్ నటరాజన్ విడుదల చేసిన ప్రకటనలో... తపాలా శాఖ ఆధ్వర్యంలో ఆడపిల్లలకు 'సెల్వ మగళ్' పొదుపు ఖాతా పథకాన్ని 2015లో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. ఈ పథకంలో, పదేళ్ల ఆడపిల్లల తల్లిదండ్రులు, సంరక్షకులు పొదుపు ఖాతా ప్రారంభించవచ్చు. కనిష్టంగా రూ.250 నుంచి రూ.1.50 లక్షల వరకు డిపాజిట్ చేయవచ్చు. అందుకు 8.2 శాతం వడ్డీ అందజేస్తారు. ఖాతా ప్రారంభించి 21 ఏళ్లు నిండిన వారికి ఈ పథక పూర్తి ఫలితాలు అందుతాయి. అంతకు ముందు, ఉన్నత విద్యకు, 10వ తరగతి పూర్తిచేయడం, 18 ఏళ్లు నిండిన ఆడపిల్లలు జమ చేసిన నగదులో 50 శాతం వరకు పొందవచ్చు. చెన్నై మండల పరిధిలో ఇప్పటివరకు 10 లక్షల ఖాతాలు ప్రారంభించి, రూ.8,351 వరకు ప్రీమియంగా స్వీకరించారు. ఈ పథకంలో ఆడపిల్లలు బ్యాంక్ ఖాతా ప్రారంభించేలా ముఖ్యమైన నగరాల్లోని తపాలా కార్యాలయాల్లో ఈ నెల 21,28, మార్చి 10వ తేది ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నారు. ప్రత్యేక శిబిరాల వివరాలను తమ సమీపంలోని తపాలా శాఖ కార్యాలయాన్ని సంప్రదించి తెలుసుకోవచ్చని ఆయన తెలిపారు.

హైకోర్టులో వాయిస్ మెసేజ్ సదుపాయం

ప్యారీస్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మద్రాస్ హైకోర్టులో వాయిస్ మెసేజ్ సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంపై పలువురు హర్షం ప్రకటించారు. ఈ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో న్యాయస్థానం ఉత్తర్వులు ఏ మాత్రం ఆలస్యం కాకుండా వెంటనే విడుదలయ్యేందుకు అవకాశం కలిగింది. ప్రపంచ వ్యాప్తంగా ఏఐ (ఆర్టిఫిషల్ ఇంటిలిజెన్స్) నూతన సాంకేతిక పరిజ్ఞానం వేగంగా వ్యాప్తి చెందుతోంది. ఈ నేపథ్యంలో మద్రాసు హైకోర్టులో తొలివిడతగా వాయిస్ మెసేజ్ సాంకేతిక పరిజ్ఞానం అమలులోకి వచ్చింది. దీనిని అందిపుచ్చుకుని కేసులపై విచారణ జరుపుతున్న న్యాయమూర్తులు ఉత్తర్వులిచ్చే సమయంలో ఆటోమెటిక్‌గా స్క్రీన్‌పై స్పష్టంగా తెలుస్తుంది. న్యాయమూర్తుల స్టెనోగ్రాఫర్లు ఈ ఉత్తర్వులను వెంటనే పరిశీలించి తీర్పు వెలువరించిన రోజే విడుదల చేయవచ్చు. ఈ సదుపాయాన్ని మద్రాస్ హైకోర్టులో న్యాయమూర్తి భరతచక్రవర్తి బుధవారం పరిచయం చేశారు. ఆయన విచారణ జరిపిన కేసులకు సంబంధించిన తీర్పులను కోర్టులో హాజరైన న్యాయవాదులు ఎల్ఈడీ స్క్రీన్‌లో తిలకించారు.

1 నుండి విద్యార్థుల ప్రవేశాలు

● పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు

ప్యారీస్, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2025-26వ విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థుల అడ్మిషన్లు మార్చి 1తేదీ నుండి ప్రారంభించాల్సిందిగా అన్ని జిల్లాల విద్యాశాఖ అధికారులకు పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది.రాష్ట్రంలో ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, టీచర్లు అడ్మిషన్ ప్రక్రియలో పాల్గొనాలని ఆదేశాలు జారీ అయ్యాయి. దీనిపై ప్రాంతీయ విద్యాశాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని గ్రామీణ ప్రాంతాల్లో నిఅంగన్వాడి కేంద్రాల్లో చదువుకుంటూ ఐదేళ్లు పైబడిన పిల్లలను ఆయా ప్రాంతాల్లోవున్న ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు చేపట్టాలి. అదే విధంగా ప్రాంతీయ విద్యాశాఖ అధికారురు ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, టీచర్లు, పాఠశాల మేనేజిమెంట్ కమిటీ సభ్యులు వచ్చే విద్యాసంవత్సరం విద్యార్థుల అడ్మిషన్లపై అవగాహనా కార్యక్రమం చేపట్టాల్సిందిగా ఉత్తర్వులు జారీఅయ్యాయి. ప్రభుత్వ పాఠశాలలో ఉన్న సంక్షేమ పథకాలు, పలు రకాల స్కాలర్‌షిప్‌ల వివరాలను ప్రజలు, విద్యార్థుల వద్ద చేర్పించాల్సివుంది. వచ్చే ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అడ్మిషన్ శాతం రెండింతలు పెరిగేలా పనులు చేపట్టాల్సిందిగా పాఠశాల విద్యాశాఖ సూచించింది.

'నరువి'తో బెల్ అవగాహన ఒప్పందం



అవగాహన పత్రాలు మార్చుకుంటున్న ఇరు సంస్థల ప్రతినిధులు

వేలూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): నరువి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రపంచస్థాయిలో మెరుగైన వైద్యం అందిస్తోంది. ఈ ఆస్పత్రి ఎల్ఐసీతో కలసి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు చికిత్స అందించేలా గతంలో ఒప్పందం చేసుకుంది. తాజాగా రాణిపేట ప్రాంతంలోని భారత్ ఎలక్ట్రానిక్ సంస్థ (బెల్) మాజీ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు నరువి ఆస్పత్రిలో చికిత్స పొందేలా అవగాహన ఒప్పంద జరిగింది. కార్యక్రమంలో నరువి ఆస్పత్రి అధ్యక్షుడు జీవీ సంపత్, బెల్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అరుణ్‌మొళి దేవన్ పాల్గొని అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు.

మద్యం జాబితా నుంచి కల్లును తొలగించాలి

● గీత కార్మికుల సంఘం డిమాండ్

ప్యారీస్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మద్యపానీయాల జాబితా నుండి కల్లును తొలగించాలని రాష్ట్ర గీత కార్మికుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు ఈశన్ మురుగస్వామి డిమాండ్ చేశారు. తిరుప్పూర్ జిల్లా పల్లడంలో ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ,పోషకాలు అధికంగా వున్న కల్లు పానీయాన్ని రాష్ట్రంలో మాత్రమే నిషేధించారని, దేశంలోని పలు రాష్ట్రాల్లో ప్రభుత్వాలే కల్లు విక్రయిస్తున్నాయని తెలిపారు. కేరళలో కల్లు విక్రయాల ద్వారా ప్రభుత్వానికి ఏడాదికి రూ.4వేల కోట్ల ఆదాయం వస్తుందని, ఈ వృత్తిలో 8వేల కుటుంబాలకు పైగా ప్రత్యక్షంగా, మరో 20వేల కుటుంబాలు పరోక్షంగా పాల్గొంటూ ఆర్థికంగా లబ్ధిపొందుతున్నాయని తెలిపారు. అయితే ఈ రాష్ట్రంలో టెంకాయ, తాటి చెట్లు అధికంగా వున్నప్పటికీ కల్లు విక్రయాలను నిషేధించడం సుమారు కోటిమంది గీత కార్మికులు ఉపాధి అవకాశాలు కోల్పోయి పొరుగు రాష్ట్రాలకు వలస వెళ్లాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ముఖ్యంగా డీఎంకే, అన్నాడీఎంకే ఇతర పార్టీల నేతలు నిర్వహిస్తున్న మద్యం ఫ్యాక్టరీల ద్వారా ఆదాయం వస్తున్నందువల్లే డీఎంకే ప్రభుత్వం కల్లు దుకాణాలు ప్రారంభించకుండా నిర్లక్ష్యం చూపుతుందని ఆరోపించారు. ఈ నెల 24న పల్లడం ప్రాంతంలో కల్లుపై విధించిన నిషేధాన్ని ఎత్తివేయాలని కోరుతూ నిర్వహించనున్న మహానాడులో పలు రైతు సంఘాల ప్రతినిధులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

ఎంజీఎం హెల్త్‌కేర్‌లో 58 ఏళ్ల మహిళకు అరుదైన క్యాన్సర్ శస్త్రచికిత్స

చెన్నై, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : పొత్తికడుపు ప్రాంతంలో క్యాన్సర్‌తో బాధపడుతున్న 58 యేళ్ల మహిళకు ఎంజీఎం హెల్త్‌కేర్ హాస్పిటల్‌లో అరుదైన శస్త్రచికిత్స చేశారు. ఈ సంక్లిష్టమైన ప్రక్రియలో క్యాన్సర్‌కు కారణమైన కణితిని తొలగించి మార్పిడి చేసి, రోగికి కొత్త జీవితాన్ని ప్రసాదించినట్లు ఆస్పత్రి నిర్వాహకులు తెలిపారు. ఈ అరుదైన శస్త్రచికిత్సను అవయవాల మార్పిడి వైద్యనిపుణుడిగా పేరుగాంచిన డాక్టర్ అనిల్ వైద్యా నిర్వహించారని, డాక్టర్ సెంథిల్ ముత్తురామన్, డాక్టర్ శివకుమార్ మహాలింగం, డాక్టర్ దినేష్‌బాబు, డాక్టర్ నివేశ్ చంద్రశేఖరన్ సహకరించారని వివరించారు.

● బాణసంచా కర్మాగారంలో పేలుడు..

మృతుడి కుటుంబానికి సీఎం రూ.4 లక్షల సాయం

పెరంబూర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): బాణసంచా కర్మాగారంలో జరిగిన పేలుడులో మృతిచెందిన కార్మికుడి కుటుంబానికి రూ.4 లక్షలు ఆర్థికసాయం అందజేయనున్నట్లు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించారు. ఈ మేరకు సచివాలయం గురువారం విడుదల చేసిన ప్రకటనలో... విరుదునగర్ జిల్లా ఆనయూర్ గ్రామంలోని బాణసంచా కర్మాగారంలో బుధవారం సంభవించిన పేలుడు ఘటనలో సురేష్ (38) మృతిచెందిన ఘటన తనను తీవ్రంగా కలిచివేసిందని, ఆయన మృతి కుటుంబానికి తీరని లోటని, ఆయన మృతికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ, మృతుడి కుటుంబానికి రూ.4 లక్షలు, గాయపడి శివకాశి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలపాండికి రూ. లక్ష అందజేయనున్నట్లు సీఎం ప్రకటించారు.

ఏడో తరగతి విద్యార్థిని ఆత్మహత్య

పెరంబూర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లాలో ఏడవ తరగతి విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన స్థానికుల్లో విషాదం నింపింది. పొన్నేరి సమీపం అగరం గ్రామానికి చెందిన రాజశేఖర్ కుమార్తె తమిళ్‌సెల్వి ఏడవ తరగతి చదువుకుంటోంది. మంగళవారం సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన తమిళ్ సెల్వి, ఎవరితో మాట్లాడకుండా తన గదిలోకి వెళ్లి తలుపు వేసుకుంది. ఎంతసేపటికి ఆమె బయటకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు గది వద్దకు వెళ్లగా తలుపు గడియ పెట్టి ఉండడం గమనించారు. కిటికీలో నుంచి చూడగా తమిళ్‌సెల్వి ఫ్యానుకు ఉరేసుకొని ఉండడం గమనించి దిగ్భ్రాంతి చెందారు. వెంటనే తలుపులు బద్దలుకొట్టి లోనికి వెళ్లి ఆమెను దేవంబట్టు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం గుమ్మిడిపూండి ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందింది. ఈ ఘటనపై తిరుపాలైవనం పోలీసులు కేసు నమోదు చేసి చేపట్టిన ప్రాథమిక విచారణలో... తమిళ్‌సెల్వి తనకు సెల్‌ఫోన్ కావాలని కోరగా, తల్లిదండ్రులు నిరాకరించడంతో మనస్తాపంతో ఈ ఘాతుకానికి పాల్పడిందని తెలిసింది.

విగ్రహాల చోరీ కేసులో ఇద్దరికి ఏడేళ్ల జైలుశిక్ష

ప్యారీస్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): విగ్రహాల చోరీకేసులో పట్టుబడిన ఇద్దరికి ఎగ్మూరు మేజిస్ట్రేట్ కోర్టు ఏడేళ్ల జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. వేలూరు జిల్లా షోలవరంలోని వరదరాజ పెరుమాళ్ ఆలయంలోకి 2011 అక్టోబరు 16న చొరబడిన ఇద్దరు వ్యక్తులు రూ.5లక్షల విలువైన నాలుగు విగ్రహాలను దోచుకుని పరారయ్యారు. ఆలయ నిర్వాహకులు అందజేసిన ఫిర్యాదును కేసుగా నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. తంజావూర్ జిల్లా అమ్మన్‌పేటకు చెందిన స్టాలిన్ (44), నీలకంఠం (50), కాంచీపురానికి చెందిన దేవరాజ్ (50), తిరుచ్చి జిల్లాకు చెందిన అబ్బాస్ (40), షేక్ కాదర్ (46), మహాబలిపురానికి చెందిన పద్మనాభన్ (46)లను అరెస్ట్ చేసి విగ్రహాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు విచారణ హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఎగ్మోర్ మేజిస్ట్రేట్ న్యాయమూర్తి కోదండరామ్ సమక్షంలో జరిగింది. విచారణ సమయంలో పట్టుబడిన నిందితుల్లో ఒకడైన దేవరాజ్ మృతిచెందగా మిగతావారు బెయిల్‌పై విడుదలయ్యారు. ఈ నేపథ్యంలో బుధవారం న్యాయస్థానం నీలకంఠం, మహ్మద్ అబ్బాస్‌లకు ఏడేళ్ల జైలుశిక్షతో పాటు రూ.20వేల జరిమానా విధిస్తూ మిగిలిన వారిని విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

గ్రామ సహాయకుడి ఆత్మహత్య



రజనీకుమార్ (ఫైల్‌ఫొటో)

తిరుత్తణి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సస్పెన్షన్‌కు గురైన గ్రామ సహాయకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు తిరువలంగాడు యూనియన్ పొన్నాడి గ్రామ పంచాయతీలోని పల్లర్ కాలనీకి చెందిన రజనీకుమార్ (39) రెవెన్యూ శాఖలో పొన్నాడి గ్రామ సహాయకుడిగా పనిచేస్తుండగా, రెండేళ్ల క్రితం సస్పెన్షన్‌కు గురయ్యారు. ఉద్యోగం లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు, కుటుంబంలో విభేదాల కారణంగా ఈ నెల 14వ తేది పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. చుట్టుపక్కల వారు అతడిని వెంటనే చెన్నైలోని రాజీవ్ గాంధీ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స ఫలించక మృతిచెందాడు. ఈ ఘటనపై తిరుత్తణి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు నిర్మించాలంటూ రైతుల ఆందోళన



ఆందోళన చేస్తున్న రైతులు

తిరుత్తణి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రైతుల కోసం రోడ్డు నిర్మించాలంటూ గురువారం ఆందోళన జరిగింది. నగరి నుంచి దిండివనం వరకు రైల్వే లైన్ ఏర్పాటుకు పల్లిపట్టు ప్రాంతంలో రైతుల భూములు సేకరించగా, ప్రస్తుతం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో, పాండ్రవేడు, రామనాయుడుకండ్రి, సీఎప్ కండ్రిగ సహా పలు గ్రామాలకు చెందిన రైతులు తాము పండించిన పంటను ట్రాక్టర్, లారీల్లో తీసుకెళ్లేలా రోడ్డు ఏర్పాటుచేయాలని కోరుతూ ఆందోళనకు దిగారు. రైల్వే అధికారులు రైతులతో చర్చించి, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

సెంథిల్ బాలాజీ బెయిల్ రద్దు చేయాలి

● సుప్రీంకోర్టులో ఈడీ పిటిషన్

ప్యారీస్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అక్రమార్జన కేసులో రాష్ట్రమంత్రి సెంథిల్ బాలాజీ బెయిల్ రద్దుచేయాలని కోరుతూ, సుప్రీంకోర్టులో ఈడీ కొత్త పిటిషన్ దాఖలు చేసింది. అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో రవాణా శాఖామంత్రిగా వ్యవహరించిన సెంథిల్ బాలాజీ, ఆ శాఖలో ఉద్యోగ అవకాశాల పేరిట పలువురి నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసి మోసగించినట్లు ఆరోపణలు న్నాయి. ఆ వ్యవహారంలో సెంథిల్ బాలాజీపై అక్రమనగదు బట్వాడా చట్టం కింద ఈడీ అధికారులు కేసు నమోదుచేశారు. ఆ తర్వాత డీఎంకేలో చేరిన సెంథిల్ బాలాజీకి మంత్రి వర్గంలో స్థానం లభించింది.. ఆయనను 2023 జూన్ 14న ఈడీ అధికారులు అరెస్టు చేసి కోర్టు ఉత్తర్వుల మేరకు జైలుకి తరలించారు. 2024 సెప్టెంబరు 24న సుప్రీంకోర్టు షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టులో ఈడీ కొత్తగా పిటిషన్ వేసింది. అందులో బెయిల్‌పై విడుదలైన తర్వాత సెంథిల్ బాలాజీ వద్ద జరిపిన విచారణ వివరాలను చేర్చింది. సాక్షులు విచారణకు సహకరించడంలేదని, ముఖ్యంగా తమిళనాడు ప్రభుత్వ ఫారెన్సిక్ నిపుణులు రెండు సార్లు విచారణకు హాజరుకాలేదని, అదే విధంగా మరికొంతమంది సాక్షులు కూడా కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘించారని, మంత్రి సెంథిల్ బాలాజీకి మంజూరు చేసిన బెయిల్ రద్దు చేయాల్సిందిగా ఈడీ తన పిటిషన్‌లో కోరింది.

హాస్టల్ విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ



విద్యార్థులకు ఉపకరణాలు అందజేస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర క్రీడాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో హాస్టల్ విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేశారు. దుస్తులు, షూ, క్రీ డా పరికరాల కిట్‌ను కలెక్టర్ సుబ్బులక్ష్మి విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మాలతి, గ్రామీణాభివృద్ధి పథక డైరెక్టర్ సెంథిల్‌కుమరన్, జిల్లా క్రీడల అధికారి సుబ్రమణి, సత్తువాచేరి క్రీడల అధికారి (హాస్టల్) బాలమురుగన్ తదితరులు పాల్గొన్నారు.

తమిళ చిత్రజ్యోతి

అద్భుతమైన ఎమోషనల్ జర్నీ



'రామం రాఘవం' చిత్ర బృందం

● సముద్రఖని

ప్రముఖ హాస్య నటుడు ధనరాజ్ హీరోగా నటిస్తూ దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'రామం రాఘవం' మూవీ ఒక అద్భుతమైన ఎమోషనల్ జర్నీ అని ఆ చిత్రంలో కీలక పాత్ర పోషించిన దర్శక నటుడు సముద్రఖని చెప్పారు. తమిళ, తెలుగు భాషల్లో పృథ్వి పోలవరపు నిర్మించారు. స్లేట్‌పెన్సిల్ పిక్చర్స్ పతాకంపై తెరకెక్కిన ఈ చిత్రాన్ని తమిళంలో జీఆర్ఆర్ పిక్చర్స్ రఘు ఈ నెల 21వ తేదీ విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా నగరంలో తాజాగా మూవీ ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించగా, సముద్రఖని చిత్రాలకు దర్శకత్వం వహించిన దర్శకులు అన్బళగన్, మణిమారన్, సుబ్రహ్మణ్య శివ, స్టంట్ సిల్వా, రైటర్ మూవీ కథారచయిత ఫ్రాంక్లిన్, నంద పెరియ స్వామి, జయప్రకాష్, తంబిరామయ్య, మలయన్ గోబి, కార్తీక్, బిగ్‌బాస్ విజేత ముత్తుకుమరన్, నటుడు దీపక్, హరీష్ తదితరులు పాల్గొని చిత్ర బృందానికి విషెస్ చెప్పారు. ఈ సందర్భంగా నిర్మాత పృథ్వి మాట్లాడుతూ, 'ఇది తండ్రికొడుకుల మధ్య బంధాన్ని వివరిస్తుంన్నారు. దర్శకుడు ధనరాజ్ మాట్లాడుతూ, 'నా తొలి సినిమా కోసం అన్నీ తానై ముందుండి నడిపిస్తున్న గొప్ప నటుడు సముద్రఖనికి ప్రత్యేక ధన్యావాదాలు. సముద్రఖని ఇప్పటివరకు 21చిత్రాల్లో తండ్రి పాత్రలను పోషించారని,నా అదృష్టమో... దేవుడి కృపనో తెలియదు.. ఈ చిత్రం ఈ నెల 21వ తేదీనే విడుదల చేస్తున్నాం'అని చెప్పారు. సముద్రఖని మాట్లాడుతూ, 'ఈ స్టోరీ నాకు చాలా బాగా నచ్చింది. ఖచ్చితంగా మంచి విజయం సాధిస్తుంది. దర్శకుడు ధనరాజ్ చాలా నిజాయితీగా ఈ సినిమా తెరకెక్కించారన్నారు.

డార్క్ హ్యూమర్‌గా 'లెగ్ పీస్'

● మార్చి 7న రిలీజ్



'లెగ్ పీస్'లో డ్యాన్సర్లతో మణికంఠన్

నటుడు శ్రీనాథ్ దర్శకత్వం వహించిన మూడో చిత్రానికి 'లెగ్ పీస్' అనే టైటిల్ ఖరారు చేశారు. డార్క్ హ్యూమర్ జోనర్‌లో రూపొందించిన ఈ చిత్రం వచ్చే నెల 7వ తేదీ విడుదల చేస్తున్నారు. ఈ చిత్ర వివరాలను నిర్మాత మణికంఠన్‌తో కలిసి దర్శకుడు శ్రీనాథ్ మీడియాకు వివరించారు. 'ఇది ఐదుగురు పురుషుల చుట్టూ తిరిగే కథ. ప్రధాన పాత్ర యోగిబాబు పోషించారు. ఆయనకు సపోర్టుగా వీటీవీ గణేష్, రవి మరియా, మొట్టై రాజేంద్రన్, కరుణాకరన్ నటించారు. ఈ ఐదుగురు చుట్టూ ఈ స్క్రీన్‌ప్లే సాగుతుంది. ఇతర పాత్రల్లో రమేష్ తిలక్, మైమ్ గోపి, జాన్ విజయ్, శరవణ సుబ్బయ్య, శామ్స్, మధుసూదనరావు తదితరులు నటించారు. చెన్నై పరిసర ప్రాంతాల్లో కేవలం నెల రోజుల్లోనే చిత్రీకరణ పూర్తి చేసారు. హీరోయిన్ లేదు కానీ ప్రత్యేక గీతం వుంది. ఇప్పటికే 'డిక్కిల్ డిక్కిల్' అనే లిరికల్ పాట విడుదల చేయగా, మంచి స్పందన వచ్చింది. నిర్మాత సి.మణికంఠన్ మాట్లాడుతూ, 'గతంలో శరవణ సుబ్బయ్య దర్శకత్వంలో హీరోగా నేను ఓ చిత్రంలో నటించాను. అది ఆశించిన స్థాయిలో సక్సెస్ కాలేదు. సినిమాలు చేసి సంపాదించాలన్న ఆశ లేదు. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాను. సినిమాపై ఉన్న అభిరుచితో నా స్థాయికి తగిన చిత్రాలు నిర్మిస్తున్నాను. ఈ సినిమాతో ఖచ్చితంగా సక్సెస్ అందుకుంటామనే నమ్మకంతో సొంతంగా రిలీజ్ చేస్తున్నాం' అని వివరించారు.



'కూలీ'లో ప్రత్యేక గీతంలో

పూజా హెగ్డే?

సూపర్ స్టార్ రజనీకాంత్ - దర్శకుడు లోకేష్ కనకరాజ్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'కూలీ' సినిమాలో హీరోయిన్ పూజా హెగ్డే ప్రత్యేక గీతంలో నర్తించనుంది. ఇందులో సూపర్‌స్టార్‌తో కలిసి నృత్యం చేయనున్నారు. 'బీస్ట్' మూవీలో విజయ్, సూర్య సరసన 'రెట్రో', రాఘవ లారెన్స్‌తో 'కాంచన-4' చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్న పూజా.. ఇపుడు 'కూలీ'లో ప్రత్యేక గీతంలో నటించేందుకు అంగీకరించింది.. కాగా, రజనీ 'జైలర్'లో 'కావాలా..' పాటకు మిల్కీబ్యూటీ తమన్నా నటించగా, ఆ పాట సూపర్‌డూపర్ హిట్‌గా నిలిచిన విషయం తెల్సిందే. కాగా ఈ చిత్రంతో సత్యరాజ్, అక్కినేని నాగార్జున, బాలీవుడ్ నటుడు అమీర్‌ఖాన్, శృతిహాసన్ నటిస్తుండగా, అనిరుధ్ రవిచందర్ సంగీతం.

సమాజంలో మార్పులను స్వాగతించాలి

● టీజే జ్ఞానవేల్

సమాజంలో వచ్చే మార్పులను స్వీకరించాలని, చిత్రపరిశ్రమలోని మూస ధోరణిని బద్ధలుకొట్టిన కొత్త టెక్నాలజీ కూడా ఆహ్వానించాలని 'జైభీమ్' దర్శకుడు టీజే జ్ఞానవేల్ అన్నారు. కమలా హరి పిక్చర్స్, వన్ డ్రాప్ ఓషన్ పిక్చర్స్ సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'జెంటిల్ ఉమెన్'. జోష్వా సేతురామన్ దర్శకుడు. లిజోమోల్ జోష్‌లాస్లియా, హరి కృష్ణన్ ప్రధాన పాత్రలు పోషించారు. సమాజంలో కుటుంబ వ్యవస్థలో స్త్రీ పాత్రను ప్రశ్నించే సామాజిక స్పృహతో రూపొందించిన మూవీ. త్వరలోనే ప్రేక్షకుల ముందుకురానున్న ఈ చిత్రం ఆడియో,ట్రైలర్ తాజాగా విడుదల చేశారు. ఇందులో నిర్మాత హరి భాస్కర్, దర్శకులు లెనిన్ భారతి, రాజు మురుగన్, 'జైభీమ్' దర్శకుడు టీజే జ్ఞానవేల్ రాజా, గేయరచయిత యుగభారతి, చిత్ర దర్శకుడు జోష్వా సేతురామన్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. ముఖ్యంగా టీజే జ్ఞానవేల్ మాట్లాడుతూ, 'లిజో కోసం ఈ ఫంక్షన్‌కు వచ్చాను. ఆమె గొప్ప కళాకారిణి. ఆమె ఎంచుకునే పాత్రలు అద్భుతంగా ఉంటాయి. ఈ సినిమాకు 'జెంటిల్ ఉమెన్' అనే పేరు ఎందుకు పెట్టారని ప్రశ్నించారు. ఇలాంటి టైటిల్ పెడితే, ఏదో ఒక ముఖ్యాంశం ఉండాలి. స్టీరియో టైప్ బ్రేక్ చేసే సరికొత్త సాంకేతికతను స్వాగతిస్తున్నాం' అని పేర్కొన్నారు.



'జెంటిల్ ఉమెన్' ఆడియో రిలీజ్ దృశ్యం



కావేరి నదీతీరంలో తంజావూరుకు 16 కి.మీ.ల దూరంలో ఉన్న దేవార క్షేత్రం తిరువయ్యారు. తిరువయ్యారు అంటేనే ప్రతియేటా జనవరిలో జరిగే త్యాగరాజ స్వామి ఆరాధనమహోత్సవమే అందరికీ గుర్తుకొస్తుంది. ఆ ప్రాంతంలోనే ఉన్న అయ్యారప్పర్ ఆలయం కూడా అంతేస్థాయిలో సుప్రసిద్ధ ప్రాచీన క్షేత్రంగా పేరొందింది. మహావిష్ణువుకు గురువుగా వేదాలను ఉపదేశించిన దక్షిణామూర్తి కొలువైన దివ్యక్షేత్రంగా భాసిల్లుతోంది. ఈ ఆలయలోనే మరో వింతగా వేలాయుధం ధరించే మురుగప్పెరుమాన్ ధనుస్సు పట్టుకుని దర్శనమిస్తున్నారు.

- టి.నగర్, ఆంధ్రజ్యోతి

ప్రాచీన పుణ్యక్షేత్రం

అయ్యారప్పర్ ఆలయం

● ధనుర్బాణాలతో దర్శనమిచ్చే మురుగప్పెరుమాన్

● మహావిష్ణువు దర్శించిన దివ్యక్షేత్రం



ఆలయ విశేషం.... : ఆలయ స్తంభాల మంటపం వద్ద 'అయ్యారప్పా' అని పిలిస్తే ఆ పిలుపు ఏడుమార్లు ఆలయమంతటా ప్రతిధ్వనించి ప్రాచీన శిల్ప కళా నైపుణ్యంతో ఆకర్షించడం విశేషం. ఈ ఆలయంలోని స్వామివారి నామధేయం అయ్యారప్పర్. అమ్మవారు ధర్మసంవర్ధిని. ఈ ఆలయంలో ఓ సన్నిధిలో మురుగప్పెరుమాన్ వేలాయుధానికి బదులుగా విల్లంబులు ధరించి ధనుస్సు బ్రహ్మణ్యస్వామిగా వళ్ళి దైవానై సమేతుడై కొలువుదీరి ఉంటారు.. మురుగప్పెరుమాన్ ఇలా విల్లంబులు ధరించడానికి రామాయణ కాలానికి చెందిన ఓ సంఘటనే కారణం. రావణసంహారం అనంతరం సీతాదేవితో తిరిగి వెళ్ళిన శ్రీరామచంద్రమూర్తి అయోధ్యను పరిపాలిస్తున్నారు. ఆ సమయంలో శృంగిబేరపురంలో నివసిస్తున్న గుహుడు శ్రీరాముడి వియోగాన్ని భరించలేక మురుగప్పెరుమాన్‌ను దర్శించి శ్రీరామచంద్రుడిని దర్శన భాగ్యం ప్రసాదించమని వేడుకున్నాడు. అక్కడి మూలవిరాట్టు మురుగన్ శ్రీరామచంద్రుడిగా, వళ్ళి సీతాదేవిగా, దైవానై లక్ష్మణుడిగా గుహుడికి దర్శనమిచ్చారు. ఆ సంఘటనను గుర్తు చేసేలా మురుగప్పెరుమాన్ శ్రీరాముడిలాగా విల్లంబులు ధరించి భక్తులను అనుగ్రహిస్తున్నారు.

ప్రాచీన ఆలయం...

ఈ ఆలయంలోని ఉత్తర కైలాసం పేరుతో ఉన్న ఆలయాన్ని మొదటి రాజరాజచోళుడి సతీమణి ఒలోక మాదేవి నిర్మించిందని చరిత్రకారులు చెబుతారు. దక్షిణకైలాసం పేరుతో ఉన్న ఆలయాన్ని గంగై కొండాన్ అని పిలువబడే మొదటి రాజేంద్రచోళుడి సతీమణి పంచవనమహాదేవి నిర్మించింది. మొదటి రాజరాజ చోళుడి కాలంలో ఈ క్షేత్రాన్ని 'పొయ్‌గై నాట్టు తిరువయ్యారు' అని పిలిచేవారని చరిత్రకారులు పేర్కొంటున్నారు.



నందీశ్వరుడు...

ఈ క్షేత్రానికి సంబంధించి ఓ పౌరాణిక గాథ ప్రచారంలో ఉంది. శ్లాతమునీశ్వరుడికి నాలుగు చేతులతో నందికేశుడు అనే కుమారుడు జన్మించాడు. ఓ పెట్టెలో ఆ శిశువును మూసి తెరచి చూడగా రెండు చేతులు తొలగి అందంగా మారింది. ఆ తర్వాత శ్లాతముని తన కుమారుడు అల్పాయుష్కుడని గ్రహించి అతడిని కాపాడే భారం పరమేశ్వరుడిదేనని భావించి తిరువయ్యారు క్షేత్రంలో విడిచిపెట్టి వెళ్ళాడు. పరమేశ్వరుడు ఆ శిశువుకు ఐదు విధాలైన అభిషేకాలు నిర్వహించాడు. కొన్నేళ్లు గడిచిన తర్వాత నందికేశుడు తన ఆయుష్షు 16 యేళ్ల లోపే ముగుస్తుందని తెలుసుకుని ఆలోగా పరమేశ్వరుడి అనుగ్రహం పొంది ముక్తి చెందాలని వాగునీటిలో కంఠం వరకు మునిగేంత నిలిచి ఏడు కోట్ల సార్లు 'ఓం నమశ్శివాయ' అంటూ రుద్రజపంతో కఠోర తపస్సు చేశాడు. ఆ తపస్సును మెచ్చి పరమేశ్వరుడు నందికేశుడికి జ్ఞానోపదేశమిచ్చి నందీశ్వరుడనే దీక్షానామం ప్రసాదించి శివగణాల అధ్యక్ష పదవినిచ్చి ఆది గురునాథుడనే అర్హత కూడా కల్పించాడు. అంతేకాకుండా స్వామివారు తిరుమళపాడిలోని వ్యాఘ్రపాదుడి కుమార్తె స్వయశాంబికతో వివాహం కూడా జరిపించాడు. ఇక శైవభక్త శిఖామణులు సుందరర్, శేరమాన్ నాయనార్ ఈ ఆలయాన్ని దర్శించేందుకు వెళ్ళినప్పుడు కావేరి నదికి ఇరువైపులా వరదలు వచ్చాయి. సుందరర్ పదిక్కమ్ గానం చేయడంతో ఆ వరదలు ఆగి వారు వెళ్లేందుకు ఆ నది దారినిచ్చింది. వీరితోపాటు మరెందరో శైవభక్తశిఖామణులు ఈ ఆలయ దివ్యమూర్తుల కీర్తి విశేషాలను తమ కీర్తనల ద్వారా గానం చేసి తరించారు.



అమ్మవారు - గుహుడికి శ్రీరాముడిలా దర్శనమిచ్చిన ధనుర్ధారి, వళ్ళి, దైవానై సమేత వేల్‌మురుగన్

శ్రీహరి గురుశివయోగ దక్షిణామూర్తి..

ఆలయ వెలుపలి ప్రాకారంలో ఓ మూల నిలిచి 'అయ్యారప్పా' అని నినాదం చేస్తే అది ఏడుసార్లు ఆలయంలో ప్రతిధ్వనిస్తుంది. ఈ ప్రతిధ్వనులు ఎలా వస్తున్నాయో నేటికీ ఇంజనీరింగ్ నిపుణులకు అంతుబట్టడం లేదు. ఆ మేరకు ఈ ఆలయం అద్భుతమైన శిల్పకళాచాతుర్యంతో ఆకట్టుకుంటోంది. స్వామివారి ప్రకారంలో ఉన్న దక్షిణామూర్తి నంబెరుమాళ్ ఆరాధించారు. పెరుమాళ్ ఆరాధించిన దక్షిణమూర్తి ఉన్న ఏకైక ఆలయం ఇది. ఈ కారణంగా ఇక్కడి దక్షిణామూర్తిని 'శ్రీహరి గురుశివయోగ దక్షిణామూర్తి' అని పిలుస్తున్నారు. చతుర్భుజాల్లో కపాలం, అభయముద్ర, శూలం, వేద తాళపత్రాలు ధరించి దక్షిణమూర్తి భక్తులకు దర్శనమిస్తున్నారు. మహావిష్ణువుకే గురువుగా వేదాలను ఉపదేశించిన దక్షిణామూర్తి కొలువైన దివ్యక్షేత్రమిదేనని శైవ పండితులు చెబుతున్నారు.



ఆలయవైభవం...

15 ఎకరాల విస్తీర్ణంలో ఏడంతస్తుల రాజగోపురం ఐదు ప్రాకారాలతో ఈ ఆలయం ఉంది. రెండో ప్రాకారంలో సోమస్కంధుడికి ప్రత్యేక ఆలయం కూడా ఉంది. ఆ ఆలయానికి చేరువగానే జబేశ్వర మండపంలో పంచ భూత లింగాలు, సప్తమాతృకలు, ఆదివినాయకుడు దర్శనమిస్తారు. ఈ ప్రాకారంలోనే వినాయకుడు, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, సోమస్కంధుడు, దక్షిణామూర్తి, నటరాజ స్వామి విగ్రహాలు కూడా ఉన్నాయి. మూడో ప్రాకారంలో తూర్పు, దక్షిణ దిశల్లో రెండు గోపురాలున్నాయి. నాలుగో ప్రాకారంలో సూర్యపుష్కరిణి, శైవభక్తశిఖామణి అప్పర్ దర్శించిన ఉత్తర కైలాస ఆలయం ఉంది. ఈ ప్రాకారానికి నాలుగు వైపులా గోపురాలున్నాయి. ఐదో ప్రాకారంలో తూర్పుదిశగా అయ్యారప్పన్ సన్నిధి, త్రిపురసుందరి సన్నిధి ఉన్నాయి. స్వామివారి సన్నిధి, అమ్మవారి సన్నిధిపై వేర్వేరు రాజగోపురాలున్నాయి. స్వామివారి సన్నిధి గర్భాలయ విమానం వెనుక కుడ్యంపై అర్ధనారీశ్వరుడి శిల్పం వింత గొలుపుతుంది. సాధారణంగా అర్ధనారీశ్వర శిల్పంలో కుడివైపు శివుడు, ఎడమవైపు పార్వతి దర్శనమిస్తారు. అయితే ఇక్కడి అర్ధనారీశ్వరుడి విగ్రహంలో కుడివైపు సగభాగంలో పార్వతీదేవి, ఎడమవైపు సగభాగంలో పరమేశ్వరుడు దర్శనమిస్తారు. ఈ ఆలయాన్ని తిరునందిదేవర్ లక్ష్మి, ఇంద్రుడు, వరుణుడు, వాలి, పట్టినత్తు పిళ్ళయార్, అరుణగిరినాథుడు దర్శించి తరించి స్వామివారిని పొగడుతూ కీర్తనలు గానం చేశారు. సూర్యభగవానుడు ఈ క్షేత్రాన్ని దర్శించి స్వామివారి అనుగ్రహం పొందారు. శైవ భక్తశిఖామణులు అరుణగిరినాథర్, తిరుజ్ఞానసంబంధర్, అప్పర్, సుందరర్ ఈ క్షేత్రవైభవాన్ని తెలిపేలా ప్రత్యేక కీర్తనలు ఆలపించారు.

ఆధ్యాత్మికం





ధర్మసంవర్ధిని సమేత అయ్యారప్పర్ స్వామి


తిరువయ్యారు...

తిరువయ్యారు సమీపంలో కావేరి, కుడముట్టి, పెన్నారు, వెట్టారు, వడారు అనే ఐదు నదులు ప్రవహిస్తున్నాయి. ఈ క్షేత్రంలోని పరమేశ్వరుడికి ఈ ఐదు నదుల పవిత్ర జలాలతో అభిషేకిస్తారు. ఇలా ఐదు నదుల (తమిళంలో ఐయ్యారు, అంటే ఐదు వాగులు) జలాలతో స్వామికి అభిషేకాలు నిర్వహించడం వల్లే ఐయ్యారు పదం ముందు స్వామివారిని తలపించేలా 'తిరు' అని కలిపి ఈ క్షేత్రాన్ని 'తిరు ఐయ్యారు' అని పిలిచేవారు. కాలగమనంలో ఆ పేరు కాస్త తిరువయ్యారుగా మారింది. ఈ ఐదునదుల్లో ఎల్లప్పుడూ జలకళ సంతరించుకునేలా చేసి ప్రజలకు సకల సంపదలను ప్రసాదించే స్వామివారే ఈ అయ్యారప్పర్.

ఎలా వెళ్ళాలి?

తంజావూరు నుండి 16 కి.మీ.ల దూరంలో కుంభకోణం నుండి 33 కి.మీల దూరంలో ఉన్న ఈ ఆలయం ధర్మపురం ఆధీనంలో ఉంది. తంజావూరుకు, కుంభకోణం నగరాలకు రాజధాని నగరం చెన్నై సహా పలు నగరాల నుండి బస్సులున్నాయి. తంజావూరు బస్టాండు నుండి షేర్‌ఆటోలు, టాక్సీలు, టౌన్ బస్సుల్లో ఆలయ ప్రాంతానికి చేరుకోవచ్చు. ప్రతిరోజూ ఉదయం 6 నుండి 11 గంటల వరకు, సాయంత్రం 4 నుండి రాత్రి 8.30 గంటల వరకు ఆలయాన్ని తెరచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

తిరుచెందూరు రాజగోపురానికి నూతన సొబగులు



చెన్నై, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ శైవక్షేత్రం తిరుచెందూరులో 9 అంతస్థులు, 137 అడుగుల ఎత్తున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ రాజగోపురం పునర్నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయి. రాజగోపురంపె రాగితో తయారైన 7.5 అడుగుల తొమ్మిది కలశాలకు కొత్త మెరుగులు అద్దుతున్నారు. రాజగోపురంలోని తొమ్మిదో అంతస్థులో వీరపాండ్యకట్ట బ్రహ్మన్న పాలనలో అమర్చిన పెద్ద గంట ప్రాచీనత కోల్పోకుండా నగిషీ చెక్కుతున్నారు. ఈ ఆలయ కుంభాభిషేకం జరిగే రోజు జూలై 7న మళ్ళీ ఈ గంట మోగనుంది. ప్రస్తుతం రాజగోపురం శిల్పాలకు రంగులు వేయనున్నారు. ఈ ఆలయ మహాకుంభాభిషేకం 2009లో జరిగింది. 16 యేళ్ల విరామం తర్వాత మళ్ళీ జూలై 7న కుంభాభిషేకం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ ఆలయ జీర్ణోద్ధరణ పనులకుగాను దేవాదాయ శాఖ రూ.100 కోట్లు, హెచ్‌సీఎల్ సంస్థ రూ.200కోట్ల మేరకు నిధులు కేటాయించింది. కుంభాభిషేకానికి ఇక నాలుగు నెలలే ఉండటంతో మొత్తం రూ.300 కోట్లతో ఆలయ మరమ్మతు పనులు చురుకుగా సాగుతున్నాయి.

నాయకత్వ బలోపేతమే మా సంస్థ లక్ష్యం



సమావేశంలో ప్రసంగిస్తున్న అనిల్ జైన్

ప్యారీస్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): యుఎన్‌జీసీఎన్ఐ వార్షిక సమావేశం 2025 స్థిరత్వంలో నాయకత్వాన్ని బలోపేతం చేస్తూ చర్యలు తీసుకున్నట్లు రెఫెక్స్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ అనిల్ జైన్ తెలిపారు. నగరంలో ఇటీవల జరిగిన ఐక్య రాజ్య సమితి గ్లోబల్ కంపాక్ట్ నెట్‌వర్క్ ఇండియా 19వ జాతీయ సమావేశంలో స్థిరమైన వ్యాపార పరిష్కారాల్లో మార్గదర్శక శక్తిగావున్న రెఫెక్స్ గ్రూప్, బాధ్యతాయుతమైన వ్యాపార పద్ధతులు నాయకత్వ నిబద్ధతను బలోపేతం చేస్తూ చర్యలు తీసుకుందని ఆ సమావేశం కన్వీనర్ జైన్ తెలిపారు. పునరుత్పాదక శక్తి, గ్రీన్ మొబిలిటీ, పారిశ్రామిక వ్యర్థాల నిర్వహన, బూడిద తొలగింపు తదితర అంశాలపై చర్చించినట్లు ఆయన పేర్కొన్నారు.

సింగపెరుమాళ్‌కోవిల్‌లో 'జీస్క్వయర్ ఫేస్3' ప్రారంభం



సింగపెరుమాళ్‌కోవిల్‌లో జీ స్క్వయర్ సంస్థ ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షిస్తున్న కస్టమర్లు

చెన్నై, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మెరుగైన సదుపాయాలతో రెసిడెన్షియల్ ప్లాట్లను నిర్మించే జీ స్క్వయర్ సంస్థ చెంగల్పట్టు జిల్లా సింగపెరుమాళ్‌కోవిల్‌లో 'జీ స్క్వయర్ ఫేస్3' ప్రాజెక్టును అట్టహాసంగా ప్రారంభించింది. ఆ సందర్భంగా కస్టమర్ల కోసం ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బాలా రామజయం మాట్లాడుతూ ఫేస్-3లో చదరపుటడుగు స్థలం ధర రూ.2999ల నుండి రూ.3500 దాకా ఉంటుందని తెలిపారు.



తన జన్మదినం సందర్భంగా ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను సీఎం క్యాంపు కార్యాలయంలో కుటుంబ సమేతంగా కలుసుకున్న ముక్కులత్తోర్ పులిపడై అధ్యక్షుడు, సినీ నటుడు కరుణాస్



చెంగల్పట్టు, తిరువణ్ణామలై జిల్లాల్లో రూ.1141కోట్లతో నిర్మించిన కొత్త రహదారులు, విస్తరించిన రహదారులను సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్



మైలాపూరు శ్రీరామకృష్ణ మిషన్ వివేకానంద కళాశాలలో 'వివేకానందుడి సిద్ధాంతాల ప్రకారం భారతదేశంలో సామాజిక సేవాపద్ధతి' అనే అంశంపై జరిగిన జాతీయ సదస్సులో ప్రసంగిస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి



రాష్ట్ర వినియోగవస్తువుల వాణిజ్య సంస్థ ఉద్యోగులకు సచివాలయంలో కొత్త యూనిఫామ్‌లు అందజేస్తున్న మంత్రి ఆర్ చక్రపాణి



జస్టిస్ ఇందిరా బెనర్జీ



జస్టిస్ భవానీప్రసాద్ - జస్టిస్ రమేష్ - రామసింగ్ - అజయ్ జైన్ - వీజే సన్నీ - సత్యశ్రీ

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఇందిరా బెనర్జీ, ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ భవానీప్రసాద్, అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డీ రమేష్, ఏపీ ఈఆర్సీ చైర్మన్ టీ రామసింగ్, ఏపీ టూరిజం స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, సినీ నటులు వీజే సన్నీ, సత్యశ్రీ ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

27న ఖాళీ డబ్బాల విక్రయానికి
సీల్డ్ టెండర్ల ఆహ్వానం

తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు అనుబంధ ఆలయాల్లో నెయ్యి, నూనె, జీడిపప్పు ప్యాకింగ్‌కు వినియోగించిన ఖాళీ డబ్బాల విక్రయానికి టీటీడీ సీల్డ్ టెండర్లను ఆహ్వానిస్తోంది. టెండర్ పొందిన భక్తులు ఖాళీ డబ్బాలను 2026 మార్చి 31వ తేదీ వరకు సేకరించవచ్చు. తిరుపతి హరేరామ హరేకృష్ణ రోడ్డులో ఉన్న మార్కెటింగ్ (వేలం) కార్యాలయంలో సీల్డ్ టెండర్లు ఈనెల 27వ తేదీన మధ్యాహ్నం 3 గంటల్లోపు అందజేయాలి. ఇతర సమాచారం కోసం మార్కెటింగ్ కార్యాలయాన్ని 0877 2264429ను సంప్రదించవచ్చు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి


శ్రీహరి సర్వదర్శనానికి 16 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం నాటి హుండీ ఆదాయం : రూ.3.48 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 72,745

తలనీలాలు సమర్పించినవారు : 24,156





కామాక్షి సమేత పాండురంగేశ్వర స్వామి ఆలయం

పులికాట్ జనం ఆరాధ్యదైవం
పంత్రంగేశ్వరుడు

సముద్రతీరంలో, పులికాట్ సరస్సు అంచున వాకాడు మండలంలో ఉంది అత్యంత పురాతనమైన కామాక్షిదేవి సమేత పాండురంగేశ్వర స్వామి శివాలయం. పులికాట్ మీద ఆధారపడిన ప్రజల ఆరాధ్య దైవం పంత్రంగేశ్వరుడు. రెండు శివలింగాలున్న ఈ ఆలయం దాదాపుగా ఒక దీవిలో ఉంటుంది. పులికాట్ తీర గ్రామాలకు, దీవుల్లోని ప్రజలకు పంత్రంగేశ్వరుడు ఆరాధ్య దైవం. రాకపోకలకు సౌకర్యవంతమైన దారులు లేకపోవడంతో భక్తుల ఆదరణ తగ్గిపోయింది. అత్యంత పవిత్రమైన ఈ పురాతన ఆలయాన్ని సందర్శించడం మాత్రం గొప్ప అనుభవం.

- వాకాడు, ఆంధ్రజ్యోతి

చరిత్ర: చోళుల కాలంలో 11వ శతాబ్దంలో నిర్మించిన ఆలయంగా చారిత్రక ఆధారాలున్నాయి. తూర్పుచాళుక్యరాజు, గుణక విజయదస్తుని సేనాని పంత్రాంగుడు నిర్మించినట్లు శాసనాధారాలు తెలుపుతున్నాయి. సునామీతో కొన్ని వందల ఏళ్ల కిందట ఇసుక మేటలో అంతర్ధానం అయిపోయిన ఈ ఆలయాన్ని 1841లో పునరుద్ధరించినట్లు చెబుతారు. ఇంకా ముందు గొప్ప నౌకాకేంద్రంగానూ, వాణిజ్య పట్టణంగానూ పంత్రంగం ఉండేదని తెలుస్తోంది. శ్రీకృష్ణదేవరాయలు కూడా పంత్రంగం దగ్గరలో ఉన్న పూడిరాయదొరువు గ్రామంలోని దీవులలోకి వచ్చి విడిదిచేసి వెళ్తుండేవాడని అంటారు.

పురాణ ప్రాశస్త్యం: రెండు శివలింగాలున్న పంత్రంగం ఆలయంకు సంబంధించి ఒక ఐతిహ్యం ప్రచారంలో ఉంది. శ్రీరామచంద్రుడు రోజూ ఇక్కడికి పూజకు వచ్చే సమయానికి ఆంజనేయస్వామి ఆయన కోసం ఇసుకతో ఒక శివలింగాన్ని తయారు చేసి సిద్ధంగా ఉంచేవాడు. ఒకరోజు ఎందు చేతనో ఆంజనేయస్వామి ఆలస్యంగా ఈ దీవికి చేరుకున్నాడు. శ్రీరామచంద్రుడు తనే ఒక శివలింగాన్ని తయారు చేసి పూజ పూర్తి చేసేశాడు. రామ భక్తుడైన హనుమకు కోపం వచ్చింది.ఆ మాత్రం ఆగలేక పోయావా అని అలిగాడు. తన భక్తుడిని శాంతపరిచి, ఆంజనేయుడు చేసిన సైకత శివలింగాన్ని కూడా పక్కనే ప్రతిష్ఠించి శ్రీరాముడు పూజ చేశాడు. దీంతో రెండు శివలింగాలున్న ఆలయంగా పంత్రంగం ప్రసిద్ధి చెందింది. శ్రీరామచంద్రుడు ప్రతిష్ఠించిన శివలింగాన్ని పాండురంగేశ్వరస్వామి అని, శ్రీ ఆంజనేయస్వామి ఇసుకతో ప్రతిష్ఠించిన శివలింగాన్ని రామలింగేశ్వరస్వామిగా పిలుస్తారు.

విశేషాలు: ఒకే ఆలయంలో రెండు శివలింగాలు కలిగి ఉండటం పంత్రాంగం ప్రత్యేకత. ఆలయం ప్రాంగణంలో వినాయకుడు, సుబ్రహ్మణ్యస్వామి, మరో వైపు కామాక్షిదేవి, భైరవుడి ఆలయాలు ఉంటాయి. పరిసర ప్రాంతాలలో 101 శివలింగాలు, 101 కొలనులు దర్శనమిస్తాయి. దూపదీప నైవేద్యాల కొరకు పలువురు దాతలు 890 ఎకరాల భూమి పంత్రాంగం ఆలయానికి ఇచ్చినట్టు ఆధారాలున్నాయి. సాధారణ రోజుల్లో ఒకటీ అరా మాత్రమే భక్తులు సందర్శిస్తారు. శివరాత్రికి మాత్రం పోటెత్తి వస్తారు. సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి, గూడూరు, నెల్లూరు పట్టణాల నుంచే కాక, తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచీ కూడా భక్తులు వస్తారు.

శివరాత్రి ప్రత్యేకం: ఈ నెల 26 బుధవారం మహాశివరాత్రి మహోత్సవాలకు ఆలయం సిద్ధం అవుతోంది. కమిటీ నిర్వాహకుడు టీడీపీ మండల అధ్యక్షుడు దువ్వూరు మధుసూదన్‌రెడ్డి దేవాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో ఘనంగా నిర్వహించేందుకు ఆలయాన్ని సిద్ధం చేస్తున్నారు.ఉదయాన్నే గణపతిపూజలో ప్రారంభమై మహాన్యాశ రుద్రాభిషేకం జరుగుతుంది. సాయంత్రం 6 గంటల నుంచి ప్రతి రెండు గంటలకోసారి పాలాభిషేకం నిర్వహిస్తారు. రాత్రి 12 గంటలకు లింగోద్భవ పాలాభిషేకం, నైవేద్యం, విశిష్ట అలంకరణ జరుగుతాయి.తెల్లవారుజామున 2 గంటలకు కళ్యాణోత్సవాన్ని నిర్వహిస్తారు. 4 గంటలకు వినాయకుడు, కామాక్షి అమ్మవారు, శివ పార్వతుల ఊరేగింపు ఉంటుంది.



శ్రీరామచంద్రుడు ప్రతిష్ఠించిన పాండురంగేశ్వరస్వామి



ఆంజనేయస్వామి ఇసుకతో ప్రతిష్ఠించిన రామలింగేశ్వరస్వామి



ఆలయ గోడలపై కనుమరుగవుతున్న పురాతన శాసనాలు

ఇలా వెళ్లాలి...

- నాయుడుపేట నుంచి మల్లాం మీదుగా 48 కిలోమీటర్లు దూరం ఉంటుంది. మల్లాం తరువాత రోడ్డు గుంతలమయంగా ఉంటుంది.
- గూడూరు నుంచి కోట మీదుగా మల్లాం చేరుకుని పంత్రంగంకి వెళ్లచ్చు. ఇది కూడా 48 కిలోమీటర్లు దూరం ఉంటుంది.
- పులికాట్ సరస్సులోంచి నడచి వెళ్లే దారి ఒకటుంది. సూళ్లూరుపేట నుంచి 25 కిలోమీటర్లు ప్రయాణిస్తే పేర్నాడుకి చేరుకోవచ్చు. అక్కడి నుంచి ఒకటిన్నర కిలోమీటర్ల దూరంలో తోటకట్ల గ్రామం ఉంటుంది. అటకానితిప్ప ఇక్కడి దాకా మట్టి రోడ్డు మాత్రమే ఉంటుంది. జీపులు, బైకులు వెళ్తాయి. తోటకట్ల నుంచి పులికాట్ సరస్సులో దిగి 4 కిలోమీటర్లు నడిస్తే పంత్రంగం చేరుకోవచ్చు. వలస పక్షులను చూస్తూ ఈ దారిలో ప్రయాణించవచ్చు. ప్రస్తుతం పులికాట్‌లో నీళ్లు లేవు. బైకులు, ట్రాక్టర్లు వెళ్తాయి. సముద్రం పోటెక్కితే నీళ్లు వస్తాయి. మోకాటి లోతు నీళ్లలోనే నడవాల్సి ఉంటుంది.

ఉదయనిధి, అన్నామలై మాటల యుద్ధం

● పరస్పర విమర్శలతో వేడెక్కిన రాజకీయం



చెన్నై, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో త్రిభాష విద్యావిధానం అమలు చేసి హిందీ భాషకు పట్టంగట్టే ప్రయత్నాలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని ఖండిస్తూ 'మోదీ గెట్ అవుట్' నినాదంతో ఉద్యమాన్ని నిర్వహించాల్సి ఉందని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి చేసిన ప్రకటనపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం వీరిద్దరి విమర్శనాస్త్రాలతో హఠాత్తుగా రాజకీయ వేడి రాజుకుంది. రాష్ట్రంలోని ప్రైవేటు విద్యా సంస్థల్లో డీఎంకే నేతల పిల్లలు హిందీ చదువుతున్నారని, అలాంటప్పుడు త్రిభాషా విధానాన్ని ఎందుకు అమలు చేయరని అన్నామలై ప్రశ్నించారు. దీనిపై ఉదయనిధి స్పందిస్తూ ఆ హిందీ నేర్పుతున్న ప్రైవేటు పాఠశాలలన్నీ కేంద్ర ప్రభుత్వ అనుమతితో నడుస్తున్నాయని, రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో పాఠశాలల్లో త్రిభాషా విధానాన్ని చోటిలేదన్నారు.

ఈ నేపథ్యంలో సేలంలో అన్నామలై మీడియాతో మాట్లాడుతూ ఇటీవల డీఎంకే మిత్రపక్షాల సమావేశంలో హిందీని దొడ్డిదారిన అమలు చేసేందుకు ప్రయత్నిస్తే రాష్ట్రం నుండే 'మోదీ గెటవుట్' అనే నినాదంతో ఉద్యమం జరుపుతామని ఉదయనిధి దురుసుతనంతో ప్రకటించారని, మంత్రిగా ఉంటూ ఇలా విమర్శ చేయడం తగదన్నారు. ఉదయనిధి మోదీ గెట్‌అవుట్ నినాదానికి స్వస్తి పలకాలని లేకుంటే శుక్రవారం ఉదయం తన ఎక్స్ పేజీలో స్టాలిన్ గెట్‌అవుట్ అనే నినాదాన్ని పోస్టు చేస్తానని, ఆ తర్వాత రెండు నినాదాల్లో దేనికి ప్రజల మద్దతు అధికంగా ఉంటుందో తేల్చుకుందామా అంటూ సవాలు విసిరారు.

గీతాభవన్ ట్రస్టు ఆధ్వర్యంలో
రేపు ఎముకల వైద్య శిబిరం

చెన్నై, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గీతాభవన్ ట్రస్టు, ఆరోగ్యభారతి తమిళనాడు సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెలల 22న ఎముకల వైద్య శిబిరం (ఆర్థోపెడిక్ క్యాంప్) నిర్వహించనున్నట్లు ట్రస్టు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. గోపాలపురం అవ్వైషణ్ముగం రోడ్డులో ఉన్న గీతా భవన్ హాలులో 22 ఉదయం 9 నుండి మధ్యాహ్నం ఒంటిగంట దాకా ఈ శిబిరం కొనసాగుతుందని, ఎగ్మూరు ఆర్థో స్పెషాలిటీ సెంటర్ నిర్వాహకులు డాక్టర్ ఎస్.ఇలవరసన్ వైద్యపరీక్షలు జరుపుతారని పేర్కొన్నారు. ఈ శిబిరంలో ఎముకల వైద్యపరీక్షలు జరుపుకోదలచినవారు శ్రీగీతాభవన్ ట్రస్టు నిర్వాహకులను 9445198100 అనే నెంబర్‌లో సంప్రతించి, అదే విధంగా ఆరోగ్యభారతి హెల్ప్‌లైన్ నెంబర్ 9444542812 కు ఫోన్ చేసి పేర్లను నమోదు చేసుకోవాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

పదేళ్లు పొరంబోకు స్థలంలో నివసిస్తే పట్టా

చెన్నై, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పొరంబోకు స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని పదేళ్లకుగా పైగా నివసిస్తున్నవారికి ప్రభుత్వం పట్టాలను అందజేయనుందని రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి అముదా తెలిపారు. స్థానిక షెనాయ్‌నగర్‌లో లబ్దిదారులకు ఇంటిపట్టాలను పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర మంత్రివర్గం ఇటీవల సంచలనాత్మకమైన నిర్ణయం తీసుకుందని ఆ ప్రకారం ఆక్షేపణ లేని పొరంబోకు స్థలాల్లో దశబ్దాలుగా నివసిస్తున్న వారికి పట్టాలను అందజేయాలని నిర్ణయించిందన్నారు. ఇప్పటికే చెన్నై, చెంగల్పట్టు, కాంచీపురం తిరువల్లూ జిల్లాలో 86 వేలకు పైగా పట్టాలను పంపిణీ చేశామని ఆమె తెలిపారు.

తమిళ అభిమానులంటే ఎంతో ఇష్టం

● గాయని శ్రేయా ఘోషల్



చెన్నై, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): తమిళ అభిమానులన్నా, చెన్నై నగరమన్నా తనకెంతో ఇష్టమని, తమిళ ప్రజలు తనపై ప్రదర్శిస్తున్న ఆదరాభిమానాలను ఎన్నటికీ మరువలేనని ప్రముఖ గాయని శ్రేయా ఘోషల్ అన్నారు. 'ఆల్‌హర్ట్స్' పర్యటనలో భాగంగా ఆమె గురువారం సాయంత్రం చెన్నై నగరానికి విచ్చేశారు. ఫిక్కీ ఆధ్వర్యంలో ఏర్పాటైన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. మార్చి ఒకటిన చెన్నైలోని నందనం వైఎంసీఏ మైదానంలో జరుగనున్న తన సంగీత విభావరి కార్యక్రమ వివరాలను వెల్లడించారు. తమిళ చలనచిత్రాల్లో తాను పాడిన పాటలు శ్రోతల మదిలో పదిలంగా ఉంటాయని చెబుతూ ఓ తమిళ పాట గానం చేసి అందరినీ మైమరపించారు. మార్చి 1న 'హల్‌హర్ట్స్' సంగీత విభావరికి సంబంధించి టికెట్ల అమ్మకాలు కూడా జోరుగా సాగుతున్నాయని ఆమె చెప్పారు.

'వీరాణం'లో తగ్గిన నీటిమట్టం

● అన్నదాతల్లో నెలకొన్న భయం

చెన్నై, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లాలోని వీరాణం చెరువులో నీటి మట్టం క్రమంగా తగ్గుముఖం పడుతుండంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఈ చెరువు సేత్తియాతోప్పు పూతంగుడిలో ప్రారంభమై లాల్‌పేట వరకు 14 కి.మీ. మేర వ్యాపించి ఉంది. ఈ చెరువులో 47.50 అడుగుల వరకు నీటిని నిల్వ చేయడానికి వీలుంది. ఈ చెరువు ఆయకట్టు కింద కీరపాళయం, కాట్టుమన్నార్‌కోవిల్, కుమరాక్షి, భువనగిరి, చిదంబరం, పరంగిపేట తదితర కావేరి వాగు చివరి ఆయకట్టు డెల్టా ప్రాంతాల వరకు సాగునీరు విడుదల చేస్తుంటారు. ప్రస్తుతం చెన్నై నగర వాసుల దాహార్తి తీర్చటానికి ఈ చెరువు నుండి రోజూ 75 ఘటనపుటడుగుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం కడలూరు జిల్లా అంతటా పగటిపూట ఉష్ణోగ్రతలు అధికం కావటం, గాలిలో తేమ లేకపోవడంతో ఆ చెరువులో నీటిమట్టం క్రమంగా తగ్గుముఖం పడుతోంది. దీంతో మార్చి నుంచి జూలై వరకు పొలాలకు సాగునీటి విడుదల అనుమానాస్పదమేనని అన్నదాతలు ఇప్పటికే ఆందోళన చెందుతున్నారు.



గాయపడిన ఏనుగుకు చికిత్స



గుంకీల సాయంతో గాయపడిన ఏనుగును వాహనంలో ఎక్కిస్తున్న దృశ్యం

పెరంబూర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ జిల్లా వాల్పారై-కేరళ సరిహద్దు ప్రాంతమైన అదిరపల్లి సమీపంలో నుదుటిపై గాయంతో ఏనుగు తిరుగుతుండడం గమనించిన స్థానికులు అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఏనుగు ఉన్న ప్రాంతానికి చేరుకున్న అధికారులు, పునరావాస శిబిరం నుంచి మూడు గుంకీ ఏనుగులను రప్పించారు. వాటి సాయంతో గాయపడిన ఏనుగును వాహనంలోకి ఎక్కించి, ఏనుగుల పునరావాస శిబిరానికి చికిత్స నిమిత్తం తరలించారు.

కెమికల్ ఫ్యాక్టరీలో భారీ అగ్నిప్రమాదం

● భయంతో పరుగులు తీసిన జనం



కర్మాగారం వద్ద దట్టంగా కమ్ముకున్న పొగ

ప్యారీస్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా తిరుముల్లైవాయల్‌లోని ఓ కెమికల్ ఫ్యాక్టరీలో గురువారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం సంభవించడంతో స్థానికులు భయంతో పరుగులు తీశారు. పెయింట్ల తయారీకి ఉపయోగించే థిన్నర్ తయారుచేసే ఆ ఫ్యాక్టరీలో హఠాత్తుగా మంటలు చెలరేగడంతో ఉద్యోగులు ప్రాణభయంతో నలువైపులా పరుగులు తీశారు. దీనిపై పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది, మంటలు అదుపుచేసేందుకు సుమారు గంటన్నర పాటు శ్రమించారు. ఆలోగా మంటలు పక్కనే ఉన్న ప్రైవేటు పాఠశాలకు వ్యాపించాయి. పాఠశాల ప్రాంగణంలోని సైకిళ్లకు నిప్పంటుకుంది. దీంతో, పాఠశాల యాజమాన్యం విద్యార్థులకు బయటకు పంపి పాఠశాలకు సెలవు ప్రకటించారు. సంఘటన జరిగిన ప్రాంతంలో పొగ కమ్ముకోవడంతో సమీపంలోని ఇళ్లలో ఉన్న వారు భయంతో బయటకు పరుగులు తీశారు. ఈ సంఘటనపై తిరుముల్లైవాయల్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

నగల చోరీ కేసులో కారు డ్రైవర్ అరెస్ట్

ప్యారీస్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక నుంగంబాక్కంలోని పారిశ్రామికవేత్త ఇంట్లో పని చేస్తూ రూ.2 కోట్ల విలువైన నగలు దోచుకున్న కారు డ్రైవర్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు, నేపాల్‌కు చెదిన మహిళ సహా ఐదుగురు కోసం గాలిస్తున్నారు. నుంగంబాక్కం లేక్ అవెన్యూలో నివసిస్తున్న అబూబకర్ ట్రేడింగ్ కంపెనీ నిర్వహిస్తున్నాడు. డిసెంబరులో ఆయన తన స్వగ్రామమైన రామనాథపురం కీల్‌కరైకు కుటుంబ సభ్యులతో కలసి వెళ్లి జనవరి 3న ఇంటికి తిరిగొచ్చారు. ఇంట్లో బీరువాలో భద్రపరచిన రూ.2 కోట్లు విలువైన నగలు, నగదు లేకపోవడంతో నుంగంబాక్కం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసిన పోలీసులు, ఆ ఇంట్లో సీసీ ఫుటేజీ పరిశీలించి విచారణ ప్రారంభించారు. ఇందులో ఆ ఇంట్లో పనిమనిషిగా చేరిన నేపాల్‌కు చెందిన శాంత, కారు డ్రైవర్ చంద్ర పారియర్ ఈ దోపిడీకి పాల్పడినట్లు నిర్ధారించారు. వీరితో పాటు శాంత కుటుంబ సభ్యులు దీపక్, గోరక్ శాయి, బబిత్ర షాలినీ కూడా నేపాల్‌కు పారిపోయారు. ఈ నేపథ్యంలో, కారు డ్రైవర్ చంద్ర పారియర్‌ను గురువారం ఉదయం అరెస్ట్ చేసిన పోలీసులు ఎగ్మూర్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం అతడిని మార్చి 3వ తేది వరకు రిమాండ్‌కు విధించింది. కాగా, పరారైన నేపాలీ మహిళ సహా ఐదుగురి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేడు ఎంఎన్ఎం
అష్టమ వార్షికోత్సవం

● సంక్షేమ సహాయాల పంపిణీ

ప్యారీస్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆళ్వార్‌పేటలో శుక్రవారం నిర్వహించనున్న మక్కల్ నీది మయ్యం (ఎంఎన్ఎం) 8వ వార్షికోత్సవంలో ఆ పార్టీ అధ్యక్షుడు కమల్ హాసన్ పాల్గొని పేదలకు సంక్షేమ సహాయాలు పంపిణీ చేస్తారని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి అరుణాచలం తెలిపారు. అధికార డీఎంకేతో సన్నిహితంగా ఉంటూ, ఆ కూటమిలోవున్న కమల్ హాసన్‌కు జులైలో రాజ్యసభ ఎంపీ పదవి కట్టబెట్టే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల విదేశాల నుంచి తిరిగొచ్చిన కమల్ హాసన్ తర్వాత పార్టీ నిర్వాహకులు, కార్యకర్తలతో కలిసి పార్టీ వార్షికోత్సవంలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ఎంఎన్ఎం ప్రధాన కార్యదర్శి అరుణాచలం గురువారం మీడియాతో మాట్లాడుతూ, పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ సహాయాలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేపడుతున్నామని తెలిపారు. పార్టీ అధినేత కమల్ హాసన్ పాల్గొనే వేడుకల్లో చెన్నై, కాంచీపురం, తిరువళ్లూరు, చెంగల్పట్టు జిల్లాలనేతలు పాల్గొంటారని తెలిపారు.

యూపీలో చిక్కుకున్న తమిళ క్రీడాకారులు

● డిప్యూటీ సీఎం చొరవతో సురక్షితంగా నగరానికి ...

ప్యారీస్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కుంభమేళా రద్దీ కారణంగా రైలు ఎక్కలేక వారణాసిలో చిక్కుకున్న తమిళ పారాలింపిక్ క్రీడాకారులు ఆరుగురిని విమానంలో తీసుకురావాలని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి ఆదేశించారు. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం వారణాసిలో పారాలింపిక్ క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఇందులో దక్షిణ భారత్ తరపున వెళ్లిన 11 మంది జట్టులో ఆరుగురు రాష్ట్రానికి చెందిన వారున్నారు. వీరంతా చెన్నై తిరిగొచ్చేందుకు గంగ-కావేరి ఎక్స్‌ప్రెస్‌లో రిజర్వేషన్ చేసుకున్నారు. అయితే, కుంభమేళా రద్దీ కారణంగా రాష్ట్ర క్రీడాకారులు రైలు ఎక్కలేక అక్కడే చిక్కుకొని, సెల్‌ఫోన్‌లో వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. దీనిపై స్పందించిన ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, ఆ క్రీడాకారులను విమానంలో తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. దీంతో, గురువారం మధ్యాహ్నం ఆరుగురు క్రీడాకారులు విమానంలో బెంగళూరు చేరుకొని, అక్కడి నుంచి మరో విమానంలో రాత్రి నగరానికి చేరుకున్నారు.